భగవద్రామానుజాచార్య

(జీవిత విశేషాలు, సిద్ధాంతం - సంక్షిప్తంగా)



కళానిధి సత్యనారాయణ మూర్తి

శ్రీ వేదభారతి

శ్రీమతే రామానుజాయ నమః

భగవద్రామానుజాచార్య

(జీవిత విశేషాలు, సిద్ధాంతం-సంక్షిప్తంగా)

కళానిధి సత్యనారాయణ మూర్తి

విశ్రాంత న్యాయశాఖ కార్యదర్శి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

సంపాదకుడు

"సంస్కృత మిత్ర"

డా॥ రేమెళ్ళ అవధానులు,

M.Sc. (Nuclear Physics), M.A., Ph.D (Sanskrit), M.A., Ph.D. (Jyotisha)

Dy. Director (Computers), (Retd)., NIMS, Hyderabad.

శ్రీ వేదభారతి

హైదరాబాదు

2013

భగవద్రామానుజాచార్య

(జీవిత విశేషాలు, సిద్ధాంతం-సంక్షిప్తంగా)

కళానిధి సత్యనారాయణ మూర్తి

ప్రథమ ముద్రణ : అక్టోబర్, 2013

వెల : **రూ. 25/-**

ప్రతులకు :

1. శ్రీ వేదభారతి

H-34, Madhuranagar, Hyderabad-500 038.

Ph./Fax.: 040-23812577 Cell : 98494 59316

e.mail : shrivedabharathi@gmail.com

www.shrivedabharathi.org

www.shrivedabharathi.in

2. Sri K.S.N. Murthy,

D-118, Madhuranagar,

Hyderabad - 500 038.

Ph : 040-23810590

Cell : 94902 95269

ముద్రణ :

Samhitha Graphics

Ameerpet, Hyderabad - 500016.

Ph.: 040-23731620, 23741620

శ్రీమతే రామానుజాయ నమః

భగవద్రామానుజాచార్య

(జీవిత విశేషాలు, సిద్ధాంతం-సంక్షిప్తంగా)

విషయ సూచిక

మా ధ్యేయం

శ్రీ ఆదిశంకరుల అద్వైతం, శ్రీ రామానుజుల విశిష్టాద్వైతం, శ్రీ మధ్వుల ద్వైతం ప్రసిద్ధమైన సిద్ధాంతాలు. ఈ మూడు సిద్ధాంతాలకు అనుయాయులు గణనీయంగానే ఉన్నారు. అయితే ఈ అనుయాయులలో చాలా మందికి 'నేనీ సిద్ధాంతానికి చెందిన వాడను' అని తెలుసునే తప్ప, తమ తమ సిద్ధాంతాలలోని మౌలికాంశాలు గాని, తమ సిద్ధాంతం ఇతర సిద్ధాంతాలోని ఏయే విషయాలతో ఏకీభవిస్తుంది, లేక విభేదిస్తుంది అనే విషయాల మీద గాని అవగాహన లేదు. ఇది యాంత్రిక జీవితం వల్ల, తెలుకోవాలనే ఆకాంక్ష లేక పోవడం వల్ల, ఈ సిద్ధాంతాల మీద గ్రంథాలు జటిలంగా ఉండడం వల్ల సంభవించింది. సిద్ధాంతకర్తల జీవిత విశేషాలు కూడా చాలా మందికి తెలియవు. ఇది సామాన్యుల పరిస్థితి. జిజ్ఞాసతో అధ్యయనం చేసే వారికి, పండితులకు చెప్పవలసిందేమీ లేదు.

అలాంటి సామాన్యులకు, ముఖ్యంగా జిజ్ఞాస ఉన్నా విపులమైన, జటిలమైన గ్రంథాలను అధ్యయనం చేయడానికి సమయం లేనివారికి, వారి వారి సిద్ధాంతాల మీద కనీస అవగాహన కలిగించాలనే ఉద్దేశ్యంతో శ్రీవేదభారతి

‘శ్రీ ఆదిశంకరాచార్య’, ‘భగవద్రామానుజాచార్య’, ‘శ్రీ మధ్వాచార్య’ అనే మూడు చిన్ని పుస్తకాలను ప్రచురించింది. సంక్షిప్తంగా ఆయా సిద్ధాంత కర్తల జీవిత విశేషాలను, సిద్ధాంతాలను కేవలం పరిచయం చెయ్యడమే ఈ చిన్ని పుస్తకాల ధ్యేయం. వీటిని చదివిన తరువాత ఆయా సిద్ధాంతానికి చెందిన వారు ప్రభావితులై వారి వారి ఆచార్యుల జీవిత చరిత్రలను, సిద్ధాంతాలను సమగ్రంగా అధ్యయనం చేస్తారని ఆకాంక్షిస్తూ...

ప్రకాశకులు

శ్రీమతే రామానుజాయ నమః

భగవద్రామానుజాచార్య

1వ అధ్యాయం

1. పూర్వరంగం

భగవద్రామానుజులు, విశిష్టాద్వైత సిద్ధాంత ప్రబోధకులు గానేగాక, మానవజాతి ఉజ్జీవించడానికి భక్తి మార్గమే విశిష్టము, ఆచరణీయము, సులభతరము అని ప్రవచించి, అంతవరకు నిరాకార, నిర్గుణ పరబ్రహ్మము మీద ధ్యాన ప్రధానమైన జ్ఞానమార్గం నుండి, జిజ్ఞాసువులు సగుణ, సాకార నారాయణ తత్త్వం మీద, ప్రేమ ప్రధానమైన భక్తి మార్గం వైపుకు పయనం చేసేలా చేసిన మహానీయులు, కారణజన్ములు, ప్రాతః స్మరణీయులు. సంప్రదాయాన్ని పాటిస్తూనే కొన్ని విప్లవాత్మక భావాలను ప్రదర్శించారాయన - అలాగని మన సనాతన ధర్మానికి విరుద్ధంగా ప్రవర్తించలేదు. ఆలయ నిర్వహణ, పూజా విధానం - వీటిమీద ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపించి, కొన్ని నియమానలను విధించారు. అవి ఇప్పటికి తిరుమలలోనేగాక ఇతర వైష్ణవ క్షేత్రాలలో కూడా పాటిస్తున్నారు.

2. ఆళ్వారులు

రామానుజులను గురించి చెప్పేముందు ఆళ్వారులను గురించి చెప్పకపోతే విశిష్టాద్వైత సిద్ధాంత చరిత్ర అసమగ్రమమే అవుతుంది. క్రీస్తు వెనుక ఏడెనిమిది శతాబ్దాలనాడు చార్వాకుడి లోకాయతం, బౌద్ధం, జైనం ప్రబలంగా ఉండేవి. ఇవన్నీ వేద

ప్రమాణాన్ని తిరస్కరించి నిరీశ్వర వాదాన్ని ప్రతిపాదించినవే. ఈ సమయంలోనే ఆళ్వారులు శ్రీమన్నారాయణుడి వైభవాన్ని, ఆయనమీద భక్తి భావాన్ని హృద్యంగమంగా ఆనాటి ప్రజల భాష అయిన ద్రావిడ భాషలో గానంచేసి విశిష్టాద్వైత సిద్ధాంతానికి బలమైన పునాదులు వేశారు. అయితే వైష్ణవం, విష్ణుతత్త్వాన్ని బోధించిన భాగవత పురాణ కాలంనుండి ఉందని రాధాకృష్ణ పండితులు వ్రాశారు.

ఈ ఆళ్వారులు పన్నెండుగురు. వారు వివిధ కులాలకు చెందినవారు. ఒక స్త్రీ కూడా ఉండడం విశేషం. వారి వివరాలు ఇలా ఉన్నాయి. పోయిగై, పూదత్త, పేయ, తిరుమళిశై ఆళ్వారులు ఏ కులానికి చెందినవారో తెలియదు. నమ్మాళ్వారులది మత్స్యకార కులం, కులశేఖరాళ్వారులు క్షత్రియులు, పెరియాళ్వారులు, తొండరడిప్పొడి, మధురకవి ఆళ్వారులు బ్రాహ్మణులు. గోదాదేవి (శ్రీ ఆండాళ్) బ్రాహ్మణులైన విష్ణుచిత్తులవారి చేత పెంచబడింది. తిరుప్పాణాళ్వారులు పంచములు. దీనిని బట్టి భక్తిమార్గానికి కులంతో సంబంధం లేదనే విషయం విదితమౌతుంది.

వీరిలో కులశేఖరాళ్వారులు తిరువాన్కూరు పాలకులలో ఒకరు. వీరి భక్తి ఆవేశపూరితమైనది. "పెరుమాళ్ తిరుమొళి" అనే ఉత్తమ కవిత్వంతో కూడిన విష్ణుభక్తి పారవశ్య గ్రంథాన్ని వ్రాశారు.

తొండరడిప్పొడి ఆళ్వారులు శమదమ సద్గుణాన్వితులు, విష్ణుభక్తి తత్పరులు. తొండర్ అంటే భక్తుల, అడిప్+పొడి అంటే పాద ధూళి. ఇలా ఆయన తనను 'భక్తాంఘ్రిరేణువు'గా

అభివర్ణించుకున్నారు. వైష్ణవంలో భగవద్భక్తి కన్నా భాగవత భక్తే మిన్న. వీరిని తెలుగువారు విప్రనారాయణుడని పిలుచుకుంటారు. ఈయన్ని లోబరచుకుంటానని దేవదేవి అనే వేశ్య శపథం చేసి, ఆయన చెంతజేరి తన శృంగార చేష్టలతోను, చతుర సంభాషణలతోనూ లోబరచుకుంటుంది. వీరి కథను తెలుగులో సారంగు తమ్మయ్య అనేకవి (ఈయన గోల్కొండ కరణం) 'వైజంతీ విలాసము' అనే చక్కటి కావ్యంగా నిర్మించాడు. ఈ కావ్యమే 'విప్రనారాయణ' అనే తెలుగు చలన చిత్రానికి ఆధారం. విప్రనారాయణ, దేవదేవికి వశమైన విధాన్ని ఆ కవి ఇలా వర్ణించాడు.

శ్లో॥ **ఆ విప్రోత్తము వజ్ర పంజర నిభంబై నిశ్చలంబైన స**
ద్భావం బంగనా సాహచర్య గుణ సంపర్కంబునన్ లోహమై,
గ్రావంబై, దృఢదారువై, తరుణ వృక్షంబై, ఫలప్రాయమై,
పూవై, తన్మకరందమై, కరగె బోఁబో నీళ్లకుం బల్చనై.

ఈయనమీద శ్రీరంగనాథస్వామి ఆలయంలో బంగారు పాత్ర దొంగిలించినట్లు అభియోగం రాగా, శ్రీరంగనాథులు ఆలయాధికారికి కలలో కనిపించి, ఆయన నిర్దోషిత్వాన్ని తెలియజేశారు. తరువాత, విప్రనారాయణ, దేవదేవి, మహాభక్తులై విష్ణు సాయుజ్యాన్ని పొందారు. ఈయన తిరుమాలై (పూలదండ) తిరుప్పళ్లి ఎఱుచ్చి (ప్రభాత గానము) అనే గ్రంథాలను వ్రాశారు.

తిరుప్పనాళ్వారులు అస్పృశ్యుడు. దేవాలయ ప్రవేశం లేనందువల్ల కావేరీ నదీ తీరంలో శ్రీరంగనాథుణ్ణి ప్రార్థించేవారు. ఈయన సమాధిస్థితిలో ఉండగా, తెలియక ఈయన్ని

గాయపరచిన సారంగముని అనే వైష్ణవుడికి శ్రీరంగనాథుడు కలలో కనిపించి, తిరుప్పనాళ్వారులను భుజం మీద ఎక్కించుకొని ఆలయానికి తేవలసిందిగా ఆదేశించారు. సారంగముని అలాగే చేశాడు. భగవదనుగ్రహం అన్ని కులాల మీద సమంగా ఉంటుందని నిరూపించడానికి వీరి కథను రామానుజులు పదే పదే ఉదాహరిస్తూ ఉండేవారట.

సామంత రాజైన తిరుమంగై ఆళ్వారులు పెరియ తిరుమాడల్, పెరియ తిరుమొళి, తిరుకుఱున్ దండకం వంటి అనేక భక్తిపారవశ్యమైన గేయకృతులు రచించారు.

పెరియాళ్వారుకు విష్ణుచిత్తులనే నామాంతరం ఉంది. వీరే గోదాదేవిని పెంచారు. వీరిద్దరి చరిత్రనే శ్రీకృష్ణ దేవరాయలవారు తెలుగులో 'ఆముక్త మాల్యద' అనే ప్రౌఢ ప్రబంధంగా మలిచారు. ఆ విష్ణు చిత్తుడు విల్లిపుత్తూరులో ఉంటూ శ్రీరంగం వెళ్లే యాత్రికులకు నిరతాన్న దానం చేసేవారట. రాయలు వారిలా వ్రాశారు.

శా. **ఆ నిష్ఠానిధి గేహసీమ నడురేయాలించి నఙ్మోయి నెం**
తే నాగేంద్ర శయానను పుణ్య కథలుం దివ్య ప్రబంధానుసం
ధానధ్వానము నాస్తి శాక బహుతా నాస్త్యుష్ణతా నాస్త్యపూ
పో నా స్త్యో దనసౌష్ఠవం చ కృపయా భోక్తవ్య మన్మాటలున్.

నడిరేయి వెళ్ళినా ఆయనింట్లో విష్ణు కథలూ, దివ్యప్రబంధాను సంధాన రవాలే కాక, ఆ విష్ణుచిత్తుడు అతిథులనుద్దేశించి, చెప్పే "అయ్యా! కూరలు లేవు, అన్నం వేడిగా లేదు, భక్ష్యాలు లేవు, నామీద కృపతో భోజనం చేయండి' అనే

ఉపచార వాక్యాలు వినిపిస్తూ ఉంటాయట.

విల్లిపుత్తూరులో విష్ణుచిత్తుడు మన్నారుస్వామికి తులసిమాల నలంకరించగా స్వామి “నీవు మధురలో నున్న పాండ్యరాజు ఆస్థానానికి వెళ్ళి కువ్యాఖ్యానాలు చేసే దుర్మదాంధులైన పండితుల నోడించి పాండ్యుని వైష్ణవుడుగా మార్చమన్నాడట. విష్ణుచిత్తుడు బెదిరిపోయి, ‘స్వామీ!

మ. **గృహసమ్మార్జనమో, జలాహరణమో, శృంగార పల్యంకికా**
వహనంబో వనమాలి కాకరణమో, వాల్లభ్యలభ్య ధ్వజ
గ్రహణంబో, వ్యజనాతపత్ర ధృతియో, ప్రాగ్దీపికారోపమో
నృహరీ వాదములేల, లేరే యితరుల్నీ లీలకుం చాత్రముల్.

మీ కోవెల శుభ్రం చెయ్యడమో, తీర్థం తేవడమో, పల్లకీ మొయ్యడమో, తులసి మాలలు కట్టడమో, ధ్వజం మొయ్యడమో, విసనకఱ్ఱ వీచడమో, దీపం పెట్టడమో చెయ్యగలను గాని, నాకీ వాదాలెందుకు, నాకిది చేతకాదు, ఇతరులను పంపండి’ అన్నాడట.

కాని స్వామి వినలేదు. విష్ణుచిత్తుడికి అఖండ పాండిత్యం అనుగ్రహించాడు. విష్ణుచిత్తుడు వాదంలో గెలిచి పాండ్యరాజును వైష్ణవుడుగా మార్చాడు. విష్ణుచిత్తుడు ‘తిరుప్పల్లాండు’ అనే ప్రసిద్ధ స్తోత్రం రచించి గానం చేశాడు. ఈ స్తోత్రానికి పల్లవిగా ‘పల్లాండు, పల్లాండు, పల్లాయిరత్తాండు, పలుకొారు నూరాయిరమ్’ అని చెప్పారు. దీని అర్థం ‘భగవంతుడికి మంగళమగు గాక! మంగళమగు గాక!’ అని భగవంతునికే మంగళాశాసనం చేయ్యడం

వలన ఈ ఆళ్వారుస్వామికి 'పెరియాళ్వారు' అంటే ఆళ్వారులలో పెద్ద అనే సార్థక నామం వచ్చింది.

గోదాదేవి ఆళ్వారులలో ఒక్కగానొక్క స్త్రీ. ఈమెనే శ్రీ ఆండాళ్ అమ్మవారు అని అంటారు. ఈమె ప్రతిరోజు తండ్రి కట్టిన పూలదండను తాను ముందర ధరించి విల్లిపుత్తూరులోని శ్రీకృష్ణునికి ధరింజేసేది. తండ్రి ఇది చూచి, ఇది భగవదపరాధమని వారించాడు గాని రాత్రి శ్రీకృష్ణుడు ఆయనకు కలలో కనిపించి ఆమె ధరించిన తరువాత వేసే దండలే తనకు ప్రీతిపాత్రమని చెప్పాడట. ఆమె యుక్తవయస్సు రాగానే ఎవ్వరిని వివాహం చేసుకోవడానికి ఒప్పుకోలేదు. తాను శ్రీరంగనాథుడినే వివాహం చేసుకుంటానన్నది.

అర్చామూర్తి నెలా వివాహం చేసుకుంటుంది? ఈ సందేహంతో బాధపడే విష్ణుచిత్తుడు ఆమెను శ్రీరంగం తీసుకువెళ్ళాడు. పాండ్యరాజు, ప్రధానార్చకుల సహాయంతో అర్చామూర్తితో వివాహం జరిపించాలనుకుని ఏర్పాట్లు చేశారు. ఆరోజు శ్రీకృష్ణుడు రుక్మిణిని వివాహం చేసుకున్న శుభలగ్నం. అదే లగ్నంలో గోదాదేవి పెండ్లికూతురులా అలంకరించుకొని శ్రీరంగనాథుని అర్చామూర్తి పాదాల వద్దకు చేరి ఆయనలో ఐక్యమై అంతర్ధానం అయింది! అందరు ఆశ్చర్య చకితులయ్యారు. ఇదే గోదా కళ్యాణం. వైష్ణవులు ధనుర్మాసారంభం నుండి రోజుకొక పాశురం చొప్పున ఆండాళ్ తల్లి రచించిన తిరుప్పావై లోని ముప్పై పాశురాలు చదివి చివరి రోజున గోదా కళ్యాణం చేస్తారు.

ఆండాళ్ తల్లి తిరుప్పావై, నాచ్చియార్ తిరుమొళి అనే స్తోత్రాలు రచించింది. తిరుప్పావైలో ముప్పై పాశురాలున్నాయి.

భగవద్భక్తి నినుమడింప చేసే అద్భుత రచనగా ఇవి ప్రసిద్ధి పొంది ధనుర్మాసంలో వైష్ణవులందరిచేత అనుసంధానింపబడుతున్నాయి.

అళ్వారులందరిలోనూ ప్రసిద్ధులు నమ్మాళ్వారు. ఈయనకు శఠకోప యతి అనే నామాంతరం కూడ ఉంది. నాలుగు వేదాలకు సారభూతమైనవి అని చెప్పబడే తిరువృత్తం, తిరువాసరియమ్, తిరువాయి మొళి, పెరియ తిరువందాది అనే నాలుగు గ్రంథాలు రచించారు. వీటిలో తిరువాయి మొళికి విశిష్ఠ ప్రచారం ఉంది. ఆళ్వారులందరు ఈయన అంశమే అని వైష్ణవులందరు నమ్ముతారు.

నమ్మాళ్వారు శిష్యుడే మధురకవి ఆళ్వారు. వీరు కవిగా ప్రసిద్ధి పొందారు. గురువును ప్రశంసిస్తూ 'కణ్ణినన్ సిరుత్తాంబు' అనే గ్రంథం వ్రాశారు. వీరు ఆళ్వారులలో చివరి వారు.

ఉపనిషత్సారభూతాలయిన ఆళ్వారుల స్తోత్రాలను 'నాలాయిరమ్' అంటారు. భక్తి తత్త్వానికి విశిష్ట ప్రచారాన్నిచ్చిన ఈ ఆళ్వారుల స్తోత్రాలను నాదముని నాలుగువేల స్తోత్రాలుగా సంకలనం చేసారు. వీరు తంజావూరు జిల్లాలోని మన్నారుగుడి గ్రామంలో క్రీ.శ.814లో జన్మించారు. వీరి మనుమడే అళవందారుగా ప్రసిద్ధిపొందిన యామునాచార్యుల వారు. వీరి శిష్యులు శ్రీశైల పూర్ణులు. వీరికి కాంతిమతి శ్రీదేవి అనేవారు సోదరీమణులు. వీరిలో కాంతిమతిని కేశవ సోమయాజి కిచ్చి వివాహం చేశారు.

ఇదీ సంక్షిప్తంగా అళ్వారుల చరిత్ర.

2వ అధ్యాయం
రామానుజులు
జీవిత విశేషాలు

కేశవ సోమయాజి కాంతిమతి దంపతులకు శ్రీ పెరంబూదూరులో క్రీ.శ.1017లో రామానుజులు జన్మించారు. వీరు బాలమేధావి. కంచిలో అద్వైత సిద్ధాంత పండితులైన యాదవ ప్రకాశులకు శిష్యుడయ్యారు.

ఆ శిష్యులలో రామానుజుల పినతల్లి కొడుకు గోవిందుడు కూడా ఉన్నాడు. అయితే గురువు అద్వైత పరంగాచెప్పే పాఠంతో రామానుజులు విభేదించేవారు. దానితో ఆయన గురువు ఆగ్రహానికి గురికావడంతో ఆయన్ను వదల వలసివచ్చింది.

అయితే యాదవ ప్రకాశులు, రామానుజుల ప్రతిభను గుర్తించి ఆయన అద్వైత సిద్ధాంతానికి ముప్పు తెస్తారని గుర్తించి ఇతర శిష్యులకీ విషయం చెప్పారు.

శిష్యులు కాశీయాత్ర నెపం పెట్టి దారిమధ్యలో రామానుజులను హత్య చెయ్యడానికి నిశ్చయించుకున్నారు. కాని తన పినతల్లి కొడుకిదంతా గ్రహించడం వల్ల రామానుజులను ఈ ముప్పునుండి తప్పించాడు. రామానుజులు అర్ధరాత్రి దుర్గమారణ్యాన్ని దాటి కంచి చేరుకున్నారు. ఇది మారువేషంలో వచ్చిన శ్రీకృష్ణుని సహాయంతోనే జరిగిందంటారు. గురువుకు చెడ్డ పేరు రాకూడదనే ఉద్ధేశ్యంతో రామానుజులు తన తల్లికి మాత్రమే

ఆ విషయం చెప్పి దాన్ని గోప్యంగా ఉంచవలసిందని ఆమెను వేడుకున్నారు.

శ్రీరంగంలో అళవందారు నివాసముండేవారు. ఆయనకు రామానుజుల ప్రతిభ తెలుసు. తన అవసానకాలంలో రామానుజులను తనవద్దకు రమ్మని కంచిలోనున్న రామానుజులకు కబురు చేశారు. కాని రామానుజులు శ్రీరంగం చేరే సరికే అళవందారు స్వామి దేహం చాలించారు. అళవందారు స్వామి పార్థివ దేహాన్ని చూచిన రామానుజులకు ఒక విశేషం గోచరించింది. ఆయన కుడి చేతి మూడువేళ్ళు ముడుచుకుని ఉన్నాయి. కారణం ఎవ్వరూ అర్థం చేసుకోలేక పోయారు. వ్యాస, పరాశరులకు సముచిత స్మారక చిహ్నం, నమ్మాళ్వారుల యెడల భక్తి ప్రపత్తులు పెంచడం, బ్రహ్మ సూత్రాలకు విశిష్టాద్వైత పరంగా వాఖ్యానం వ్రాయడం అనే మూడు కోరికల నది సూచిస్తుందని రామానుజులు అంతర్ దృష్టితో గ్రహించారు. నిజానికి అళవందారు స్వామికి విశిష్టాద్వైతపరంగా బ్రహ్మసూత్రాలకు వ్యాఖ్య వ్రాయాలనే కోరిక ఉండేది. ఈ మహత్కార్యాన్ని రామానుజులు చేద్దామని దీక్షపట్టి కంచికి తిరిగి వచ్చారు. అప్పటికే అద్వైతపరంగా శంకరులు రచించిన వ్యాఖ్య బహుళప్రచారంలో ఉంది. దాన్నికాదని వేరే వ్యాఖ్య రాయడం తేలిక కాదని రామానుజులకు తెలుసు.

అళవందారు స్వామి గతించిన తరువాత వారి స్థానాన్ని అలంకరించడానికి రామానుజులే సమర్థులని భావించి అళవందారు శిష్యుడు పెరియనంబి కంచికి బయలుదేరగా, ఇక్కడ రామానుజులు పెరియనంబి వద్ద విశిష్టాద్వైత రహస్యాలు

తెలుసుకోవాలని కంచికి బయలుదేరారు. ఇద్దరు దారిలో మధురాంతకం వద్ద కోదండరామ స్వామి ఆలయంలో కలుసుకున్నారు. పెరియనంబిని గురువుగా భావించి ఆయన్ని భార్యతో సహా కంచికి రావలసిందని ఆహ్వానించి వారిద్దరిని కంచికి తీసుకువెళ్ళారు. అక్కడ పెరయనంబి రామానుజలకు వేదసారాన్ని బ్రహ్మసూత్ర సారాన్ని విశిష్టాద్వైత పరంగా వ్యాఖ్యానించి ఉపదేశించారు.

రామానుజుల భార్య తంజమ్మ. కులాచారాల విషయంలో వారిద్దరి దృక్పథాలలో చాలా తేడా ఉండేది. రామానుజులది విశాల దృక్పథం. ఒకసారి రామానుజులు తమ గురువైన తిరుక్కచ్చినంబిని భోజనానికి ఆహ్వానించారు. అయితే నంబి వచ్చిన సమయానికి రామానుజులు ఇంట్లో లేరు. కాని నంబి 'తొందరగా వెళ్ళాలి, భోజనం పెట్టండి' అని తొందర చేయడంతో తంజమాంబ భోజనం పెట్టి ఆ ప్రదేశాన్ని శుద్ధి చేసి తాను కూడా శుద్ధి స్నానం చేసిందట. దీనికి కారణం నంబి వైశ్యుడవడం. ఇంటికి వచ్చిన తరువాత ఈ సంగతి తెలుసుకొని రామానుజులు బాధ పడ్డారు. మరొకసారి ఆకొన్న వైష్ణవుడొకడు భోజనము పెట్టమంటే ఇంట్లో బియ్యం ఉన్నా కూడా లేవని అసత్యం పలికి రామానుజులకు ఆగ్రహం తెప్పించింది. మరొక సంఘటన రామానుజుల హృదయాన్ని మరీ బాధించింది. పెరియనంబి భార్యతో కూడా రామానుజుల ఇంట్లో ఉంటూ ఆయనకు దివ్యప్రబంధాన్ని బోధిస్తూ ఉంటే రోజులలో ఒక చిన్న

విషయంలో తంజమ్మ పెరియనంబి భార్యతో కలహం పెట్టుకుంది. నంబి దీనితో కలత చెంది వెంటనే వెళ్ళిపోయారు.

పై మూడు ఉందంతాలతో రామానుజులు కలత చెంది భార్యను పుట్టింటికి పంపించి తాను సన్న్యాసం తీసుకొని 'యతిరాజ' అని ప్రసిద్ధి పొందారు. కంచిలోనే మఠం స్థాపించి విశేషకీర్తి నార్జించారు. ఆయన మేనల్లుడు దాశరథి మొదటి శిష్యుడు, మహాధనవంతుడైన కూరేశుడు ఆస్తినంతటిని దానంచేసి రెండవ శిష్యుడయ్యాడు.అద్వైతాచార్యుడైన యాదవ ప్రకాశుడు (రామానుజుల మొదటి గురువు) మూడవ శిష్యుడై సగుణ బ్రహ్మం మీద ఉపదేశం పొందాడు.

తిరుకోష్టియూరులో నున్న గోష్ఠీపూర్ణుల వద్ద 'ఓమ్ నమో నారాయణాయ' అనే తిరు మంత్రాన్ని ఉపదేశం పొందారు. అత్యంత గోప్యంగా ఉంచకపోతే నరకప్రాప్తి తప్పదని గురువు చెప్పినా వినక రామానుజులు దేవాలయ శిఖరం మీదనుండి అందరికి ఆ మంత్రాన్ని ఉపదేశించారు. గురువులు కోపిస్తే "నేను నరకానికి పోయినా, వేలమంది తరిస్తారు కదా! అదే నాకు చాలు' అని బదులు చెప్పి తన సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని చాటుకున్నారు. కాశ్మీరం వెళ్ళి శంకరులు ఎక్కువగా ఆదరించిన భోధాయన వృత్తిని రాజు అనుమతితో శ్రీరంగానికి తీసుకు వెళ్తూండగా అక్కడి పండితులు దాన్ని అపహరించారు. అయితే ఈలోగా దాన్ని తనను అనుసరిస్తున్న కూరేశులు కంఠస్థం చేసి గ్రంథం లేనందుకు విచారించ పని లేదని భరోసా ఇచ్చారు. తరువాత వైష్ణవ సిద్ధాంత గ్రంథాలను అధ్యయనం చేసి తాను

స్వయంగా బ్రహ్మసూత్రాలకు విశిష్టాద్వైత పరంగా వ్యాఖ్య రచించి ఆ సిద్ధాంతాన్ని విశేషంగా ప్రచారం చేశారు. ఆ భాష్యాన్నే 'శ్రీభాష్యం' అంటారు.

శ్రీరంగనాథ ఆలయానికి సర్వాధికారిగా ఉంటూ దాన్ని శ్రీవైష్ణవ కేంద్రంగా మార్చారు. ఆలయ నిర్వహణ, పూజావిధానాలను క్రమబద్ధీకరించారు. తిరుపతిని సందర్శించి అక్కడకూడా పూజావిధానాన్ని క్రమబద్ధీకరించారు. అదే ఇప్పటికీ కొనసాగుతుంది. తన శిష్యుడు ప్రతివాదిభయంకర అణ్ణన్ స్వామి (క్రీశ. 1321 - 1454)' చేత 'శ్రీవేంకటేశ్వర సుప్రభాతాన్ని' రచింపజేశారు. దాన్ని ఇప్పుడు ప్రతిరోజూ సుప్రభాత సేవలో గానం చేస్తారు. ఉత్తరదేశ దిగ్విజయ యాత్ర చేశారు. యజ్ఞమూర్తి అనే అద్వైత పండితుణ్ణి ఓడించి తన శిష్యుడుగా చేర్చుకున్నారు. కాలక్రమంగా 'శ్రీభాష్యం' ప్రసిద్ధిపొందింది.

ఆరోజులలో దక్షిణాపథాన్ని చోళులు పరిపాలిస్తూ ఉండేవారు. వారు శైవులు. శైవం, వైష్ణవం, అద్వైతం విశేష ప్రచారంలో నున్న ఆకాలంలో సమున్నత దేవాలయాలు - అన్ని సిద్ధాంతాల వారికి దర్శనీయమైనవి - దక్షిణ భారతంలో నిర్మించబడ్డాయి. అవే ఇప్పుడు మనదేశ ఆధ్యాత్మిక సంపద.

చోళరాజు ఆగ్రహానికి గురై రామానుజులు శ్రీరంగం విడిచి మైసూరు చేరుకున్నారు. అక్కడ మేల్కొటిలో శ్రీకృష్ణ దేవాలయం నిర్మించి అస్పృశ్యులకు కూడా ప్రవేశం కల్పించి తన మానవతా

దృక్పథాన్ని ఆవిష్కరించారు. కొంతకాలం తరువాత శ్రీరంగానికి తిరిగివచ్చి క్రీ.శ.1137లో విష్ణుసాయుజ్యం పొందారు. ఆయనది 120 సంవత్సరాల పూర్ణాయుష్షు!

3వ అధ్యాయం

విశిష్టాద్వైత సిద్ధాంతం

1. ప్రవేశిక

నిర్గుణ నిరాకార బ్రహ్మాన్ని ధ్యానమార్గం ద్వారా దర్శించి దానితో తాదాత్మ్యం చెంది మోక్షాన్ని పొందడం సిద్ధాంతపరంగా అంగీకారమే అయినా, అది సామాన్యులకు అవగాహన అయ్యేది గాని ఆచరణ సౌలభ్యం కలది గాని కాదని చాలామంది అభిప్రాయం. ప్రత్యక్షంగా కనిపించని తత్త్వం ఉందని నమ్మి దానినుపాసించడం సామాన్యులకు ఊహకందని మార్గం. "నిశ్చలము, నిర్వికారమగు శంకరుని బ్రహ్మ మెట్టి కర్తృత్వ ప్రభావము లేనిదగుటచే, మనకు పూజ్యభావము నుదయించజేయుదు.... భక్తులు తమ కష్టకాలములో భగవానునితో బొందు సజీవ సాన్నిధ్యమున కుచిత స్థానమును శంకరుడొసగలేదు', అని రాధాకృష్ణ పండతుడభిప్రాయపడెను. (భారతీయ తత్త్వ శాస్త్రం Vol పేజి. 195-196 తి.తి.దే. ప్రచురణ). అయితే, శ్రీ శంకరభగవత్పాదులు శివ, విష్ణు, గణపత్యాది మతములను ప్రవేశ పెట్టి, షణ్మతస్థాపనాచార్యులు అని

పేరుపొందారు. అద్వైత సిద్ధాంతంతోబాటు విగ్రహారాధన యొక్క ఆవశ్యకతను వారు అంగీకరించారు అనే విషయం గమనార్హం. ఈవిషయాన్ని భగవద్గీతకూడ వివరించింది.

శ్లో. **క్లేశోஉధికతరస్తేషామ్ అవ్యక్తాసక్తచేతసామ్ ।**
అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భిరవాప్యతే ॥ (12.5)

అవ్యక్త బ్రహ్మం మీద ఆసక్తితో చేసే సాధన కష్టతరమైనది. దేహాభిమానులకు అవ్యక్త బ్రహ్మ ప్రాప్తి కష్టమే!

జ్ఞానమార్గం క్లిష్టమైనదని, కర్మమార్గం కొంత సులభమే అయినా, నిష్కామంగా, ఈశ్వరార్పణగా కర్మచెయ్యడానికి కావలసిన సంస్కారం, త్యాగబుద్ధి అందరికి ఉండవని, అందుచేత సులభతరమైనది భక్తిమార్గమేనని చివరికి భగవద్గీత ఇలా ప్రవచించింది.

శ్లో. **సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ।**
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥(18.66)

నిత్యనైమిత్తికాది కర్మాచరణకంటే నన్ను శరణువేడడమే మేలు. అలా నాకు శరణాగతి చేస్తే నిన్ను అన్ని పాపాల నుండి విముక్తుణ్ణి చేస్తాను. నీకు శోకించవలసిన అవసరం లేదు అన్నాడు శ్రీకృష్ణుడు అర్జునునితో. దీన్ని వైష్ణవులు చరమశ్లోకం అంటారు.

దీనిలో సౌలభ్యం ఏమిటంటే, మన నియత కర్మలను భగవదర్పితంగా చేసి ఆయనమీద అచంచల విశ్వాసం ఉంచితే ఆయన మనలను పాపాల నుండి విముక్తుణ్ణి చేసి మోక్షం

ప్రసాదిస్తాడనేది. భాధ్యత ఆయనదే గాని మనదికాదు. ఇది భక్తిమార్గంలోని పరమార్థం. అయితే నియతకర్మలు వదలడమంటే అధర్మంగా ప్రవర్తించ వచ్చని మాత్రం కాదు. ఈ సిద్ధాంతాన్నే ఆళ్వారులు గానం చేశారు. అవి ద్రావిడ వేదంగా ప్రసిద్ధిపొందాయి.

రామానుజుల కాలం నాటికి అద్వైతం బహుళ ప్రచారంలో ఉంది. దానితోబాటు శైవం- కేవలం శివుడే దైవం అనే మతం- కూడా ప్రబలంగానే ఉంది. అయితే సామాన్య ప్రజలు భక్తి మార్గానికి ఆకర్షితులైనంతగా జ్ఞానమార్గానికి ఆకర్షితులు కాకపోవడానికి కారణం, అది దోషపూరితమైనదని కాదు, సామాన్యులకు ఆచరణ సాధ్యమైనది కాకపోవడం వల్లే. ఇదే పరిస్థితులలో రామానుజులు ఆధ్యాత్మిక రంగప్రవేశం చేసి విశేషాదరణ పొందారు.

శంకరులు ఆస్తికులు, రామానుజులూ ఆస్తికులే; శంకరులు వేదప్రామాణ్యాన్ని అంగీకరించారు, రామానుజులూ అంగీకరించారు - ఇలా వారి సిద్ధాంతాలలో సారూప్యం లేకపోలేదు. అయితే శంకరుల నిర్గుణ, నిరాకార బ్రహ్మతత్త్వం, జీవబ్రహ్మైకవాదం, ప్రపంచ మిథ్యావాదం - ముఖ్యంగా వీటితో రామానుజులు విభేదించారు. విశ్వం మిథ్యకాదని, పరమాత్మ జీవాత్మలు వేరువేరు అని, సకల కళ్యాణగుణ సమన్వితుడు, దివ్య మంగళ స్వరూపుడు అయిన శ్రీమన్నారాయణుడే సృష్టికర్త, సర్వ నియామకుడు అని, ఆయన మీద భక్తి మాత్రమే ఏకైక మోక్ష సాధనమని ప్రవచించారు. ఇక వారి సిద్ధాంతాన్ని విపులంగా చర్చిద్దాం.

అయితే ఇక్కడ ఒక విషయం చెప్పాలి. అద్వైతానికి, విశిష్టాద్వైతానికి, ద్వైతానికి ప్రస్థానత్రయమే ఆధారం. విశిష్టాద్వైతులకు ద్రావిడ వేదం, సుదర్శనభట్టర్, వేదాంతదేశికులు మొదలైన వారి రచనలు కూడ శిరోధార్యం. అయితే ప్రస్థానత్రయంలో ఎక్కడా ఈ మతభేదాలు గాని, అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత సిద్ధాంతాలనే పేర్లుగాని కనిపించవు. జీవాత్మ-పరమాత్మల భేదాభేదముల మీద ఆధారపడి ఆ సిద్ధాంతాల కాపేర్లు అనంతరం వచ్చినవి.

2. సారసంగ్రహం

కపిస్థలం దేశికాచార్య స్వామివారు తమ సిద్ధాంతత్రయ సంగ్రహములో విశిష్టాద్వైత సిద్ధాంత సారసంగ్రహంగా ఈ శ్లోకాన్ని అనుగ్రహించారు.

శ్లో॥ శ్రీమల్లక్ష్మణయోగినస్తు భువనంసత్యం తదీశః శ్రియః
కాంతో బ్రహ్మ. సఏవ, సోఽఖిలతనుః, భిన్నాస్తత శ్చేతనాః
సత్యా సంసృతిరీశనిగ్రహ కృతా, ముక్తిస్తు భక్త్యాదినా
తత్ర్పాప్తిః పరమే పదే తదనుభూత్యా ఖ్యేతి సంచక్షతే ॥

తన సంకల్ప మాత్రం చేత పరమాత్మ మూల ప్రకృతిని వినియోగించి మాయను ఉపకరణంగా చేసుకుని ఈ విశ్వాన్ని సృష్టిస్తున్నాడు. దానిని ప్రత్యక్షంగా మనం చూస్తున్నాము. అందుచేత అది సత్యమేగాని మిథ్యకాదు. శ్రీమన్నారాయణుడే విశ్వానికి అధిపతి, నియామకుడు. విశ్వంలోని చేతనాచేతన వస్తువుల నన్నిటిని ఆయన శరీరంగా కలిగియున్నాడు. జీవాత్మలు పరమాత్మకంటె వేరు, వారిద్దరికి ఐక్యము ఎన్నటికి కలుగదు.

కర్మానుసారం లభించిన ప్రాకృత శరీరమే సంసారము. భగవవంతుని గూర్చి నిశ్చల నిరంతర భక్తి ప్రవృత్తుల ద్వారా వైకుంఠవాసుడైన శ్రీమన్నారాయణుని సన్నిధిలో బ్రహ్మానుభవం పొందడమే మోక్షము.

ఈ సారసంగ్రహం ద్వారా శంకరులు ప్రతిపాదించిన ప్రపంచ మిథ్యాత్వం, జీవాత్మపరమాత్మల స్వరూపైకత్వం, బ్రహ్మముయొక్క నిరాకార, నిర్గుణ తత్త్వం - వీటన్నిటిని విశిష్టాద్వైతం నిరాకరిస్తుందనే విషయం స్పష్టమవుతుంది.

3. 'విశిష్టాద్వైతం' అంటే ఏమిటి?

'ఏకమేవాఽద్వితీయం' అనిశ్రుతి వాక్యం. శ్రుతికి వ్యతిరేకార్థం చెప్పడం శాస్త్ర సమ్మతంకాదు. అనుగుణంగానైనా సమన్వయంగానైనా అర్థంచెప్పాలి. అద్వైతం శ్రుతికి అనుగుణంగా, ఉన్నది బ్రహ్మం ఒక్కటే, అందుచేత జీవాత్మ పరమాత్మ అని రెండు తత్త్వాలున్నాయనడం తప్పు అంటుంది. అయితే విశిష్టాద్వైతం శ్రుతి సమన్వయంగా అర్థం చెబుతుంది.పరమాత్మ, అచేతనం (విశ్వం), చేతనం (జీవుడు) అని మూడు తత్త్వాలున్నాయి. అందులో చేతనాచేతనాలు రెండు ప్రళయకాలంలో పరమాత్మలోనే కలుస్తున్నాయి. ఈ విధంగా చూసినప్పుడు అద్వైతమే. అయితే దీనిలో ఒక విశిష్టత ఉంది. ఈ చేతనా చేతనాలు రెండు పరమాత్మకు శరీరాలు. ఈ విధంగా పరమాత్మ అద్వితీయుడే అయినా ఆయనకు ఈ విశిష్టత ఉండడం వల్ల ఈ సిద్ధాంతాన్ని 'విశిష్టాద్వైతం' అన్నారు. 'జగత్తును, జీవులను దేవుని

శరీరము; దేవుని దేహముగానే వానికునికి గలదేలన, దేవుడే వానికాత్మయు, యజమానియునగును, బ్రహ్మమునకు వేరుగా వానికస్తిత్వము లేదు. జీవాత్మయు, జడ జగత్తు నీశ్వర భిన్నములే గాని, ఈశ్వరాధీనములై, ఈశ్వరసేవార్థముకాక వానికి వేరే ప్రయోజనము లేదు. కావున రామాజుని సిద్ధాంత మద్వైతమేకాని, యొక విశేషముతోఁ గూడియున్నది. ఏకమైన పరమాత్మ యనేకత్వము నంగీకరించును; అది జీవ జగత్తులతో కలిసి యుండును. అందుచే నది విశిష్టాద్వైతమైనది' అని రాధాకృష్ణ పండితులు విశ్లేషించారు. (భారతీయ తత్త్వ శాస్త్రం Vol. 5-పేజి. 196-197)

4. సారస్వతం

ఏ సిద్ధాంతానికైన తత్సంబంధిత సారస్వతం, దాని ప్రచారం ముఖ్యం. అద్వైత సారస్వతమంతా సంస్కృత భాషలోనే ఉంది. అందుచేత దానికి యావద్భారత దేశంలోనూ ప్రచారం వచ్చింది. ద్వైతమత సారస్వతం కొంత సంస్కృతంలోనూ కొంత కన్నడంలోనూ ఉంది. అయితే విశిష్టాద్వైత సిద్ధాంత సారస్వతం చాలమటుకు ద్రవిడ భాషలోనే ఉంది. ఈ సిద్ధాంతంలో భోధాయనవృత్తికి ఎక్కువ ప్రాధాన్యం ఉంది. ఇతని కాలం ఎవరూ నిర్ణయించలేదు. ఆయన బ్రహ్మసూత్రాల మీద వృత్తి రచించాడు. చారిత్రకంగా ఈయనే విశిష్టాద్వైత సిద్ధాంతానికి పునాదులు వేశాడని అంటారు. రామానుజులు కాశ్మీరంలోని సరస్వతీ పీఠంలో ఈ

వృత్తిని అక్కడి పండితులు చూపడానికి ఇష్టపడకపోయినా శారదాంబకటాక్షంతో సంపాదించి తిరిగి వెడుతూండగా మళ్ళీ ఆ పండితులు వెంటాడి స్వాధీనపరచుకున్నారు. అయితే ఈలోగా రామానుజుల ననుసరించిన కూరేశులు దానిని ఆధ్యయనం చేసి ధారణచేసి యుండడం చేత వారి సహాయంతో దాని ఆధారంగానే ఆళవందారు కోరిక మేరకు బ్రహ్మ సూత్రాల మీద శ్రీభాష్యం రచించారు. విశిష్టాద్వైత సిద్ధాంత సారస్వతంలో ఇది మకుటాయ మానమైనది. దీనికి సుదర్శనభట్టు శ్రుత ప్రకాశిక అనే టీక రచించారు. ఆళ్వారులు ఉపదేశ సారస్వతాన్ని నాథముని ఒక క్రమపద్ధతిలో నాలుగువేల పాశురాలలో క్రోడీకరించారు. అదే ద్రావిడ వేదంగా ప్రసిద్ధినొంది పారాయణ చేయబడుతూంది. నమ్మాళ్వారు తిరువాయిమొళి, ఆండాళ్ తిరుప్పావై ప్రసిద్ధాలు. వేదాంతదేశికుడు రామానుజుల శ్రీభాష్యానికి, గీతాభాష్యానికి తాత్పర్యమేకాక ఇంకా అనేక ఇతర రచనలను చేశాడు. వీరి దయాశతకం, పాదుకా సహస్రం ప్రసిద్ధాలు. శ్రీ పిళ్ళై లోకాచార్యుల వారి శ్రీవచనభూషణము ప్రసిద్ధ గ్రంథం. ఇలా అపారమైన సారస్వతం తమిళంలోనూ, సంస్కృతంలోనూ విశిష్టాద్వైత సిద్ధాంతం మీద వెలసింది.

5. ప్రమాణములు

సత్యాన్వేషణలో - అది ఏ శాస్త్రానికి సంబంధించినదైనా - ప్రమాణాలు పునాదిరాళ్ళలాంటివి. వేదాంతం ముఖ్యంగా

ప్రమాణాలను ఆధారంగా చేసుకునే సిద్ధాంతాలను ప్రతిపాదించింది. ప్రమాణాలు అనేకం. అయితే అందులో ప్రత్యక్షం, అనుమానం, శబ్దం అనే మూడూ ముఖ్యం. ఈ మూడింటిని కాక కొన్ని ఇతర ప్రమాణాలను కూడా అద్వైతం ఆయా సందర్భాలలో అంగీకరించింది. శబ్ద ప్రమాణం అంటే వేద ప్రమాణం అన్నమాట. వేదం పరమాత్మ నిర్గుణుడు, నిరాకారుడు, త్రికాల అబాధితుడు జనన మరణాల కతీతంగా అన్ని కాలాలలోనూ ఉండేవాడు అని చెబుతుంది. అందుచేత బ్రహ్మం సత్యం. మన కంటికి కనిపించే విశ్వం మాత్రం సృష్టి, స్థితి లయలకు లోనై అశాశ్వతంగా ఉండేది అని వేదం చెబుతుంది. అందుచేత విశ్వం అసత్యం. ఇలా శంకరులు వేద ప్రమాణానికి ప్రథమ స్థానం ఇచ్చారు. ప్రత్యక్ష ప్రమాణానికి రెండవ స్థానాన్ని ఇచ్చారు. దీనికారణంగా విశ్వం వ్యావహారిక సత్యమని, పరమాత్మ పారమార్థిక సత్యమని అన్నారు.

అయితే రామానుజులు ప్రత్యక్ష, అనుమాన, శబ్దప్రమాణాలను ఒప్పుకున్నా, ప్రత్యక్ష ప్రమాణానికి పెద్దపీట వేశారు. ప్రత్యక్షంగా కనిపించేదాన్ని ఏదో శాస్త్రవాక్యం ఆధారంగా దాన్ని మిథ్యగా నిరాకరించడం రామానుజులు ఒప్పుకోరు. ఆయన ప్రత్యక్షంగా కనిపించేదానికి విరుద్ధంగా శాస్త్రానికి అర్థం చెప్పకూడదంటారు. అయితే యజ్ఞం చేస్తే హవ్యాన్ని దేవతలకు అగ్నిదేవుడు అందిస్తాడు అని వేదం చెబుతుంది. పితృకార్యం చేసినప్పుడు పిండ ప్రదానం చేస్తే అది పితృదేవతలకు

చేరుతుందని, దానికోసం వారు వేచిఉంటారని వేదం చెబుతుంది. వాటిని ప్రత్యక్షంగా మనం చూడలేము. అందుచేత ఏది మనకు ప్రత్యక్షంగా కనిపించదో దాని విషయంలో మాత్రమే శాస్త్రం ప్రమాణం. అలా నమ్మనివాళ్ళు నాస్తికులు అని విశిష్టాద్వైత సిద్ధాంతం.

మరి వేదశాస్త్రాలలో కొందరు దేవతలకు అనేక దివ్యమంగళ రూపాలు కూడా ఆపాదించి ఉపాసనలను ఉపదేశించబడ్డాయి. మరి ఈ రూపాలన్నీ మనకు ప్రత్యక్షంగా గోచరించడం లేదు గనుక ఆ ఉపాసనలన్నీ వ్యర్థం అంటే ఎలా? అందుచేత రామానుజులు ప్రత్యక్షంగా కనిపించేది నమ్మండి, మన జ్ఞానేంద్రియ వ్యవస్థకి అందని వాటిమీద శబ్ద ప్రమాణాన్ని అంగీకరించండి అని ఉపదేశించారు. దీని పర్యవసానమే ప్రపంచం సత్యం అనే సిద్ధాంతం.

ఇక అనుమాన ప్రమాణం ఆయూ సందర్భాలలో అంగీకార యోగ్యమే.

6. పరమాత్మ సశరీరుడు

విశిష్టాద్వైత సిద్ధాంతాలలో భక్తి, ప్రపత్తి (శరణాగతి) అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. నిరాకార, నిర్గుణ బ్రహ్మం భక్తికి అనుకూలమైన దైవ స్వరూపం కాదని రామానుజల సిద్ధాంతం. పురాణేతి హాసాలన్నింటిలోనూ పరమాత్మను సగుణ సాకార తత్త్వంగానే చిత్రీకరించినప్పుడు పరమాత్మకు రూపంగాని గుణాలుగాని లేవనడం అసంగతం. శంకరుల నిరాకార బ్రహ్మం ఒక శూన్యం లాంటిదని, అది బౌద్ధుల శూన్యవాదానికి చేరువగా

ఉందని, అది ఆమోదయోగ్యం ఎంతమాత్రం కాదని రామానుజుల అభిప్రాయం. పరమాత్మ నిరాకార నిర్గుణుడైనపుడు ఆయన ప్రత్యక్ష, అనుమాన, శబ్ద ప్రమాణాలకు అందని తత్త్వమే అవుతాడు. ఏ ప్రమాణానికీ అందని తత్త్వాన్ని ఉందని నమ్మడం, పూజించడం సాధ్యంకాదు.

పరమాత్మ దివ్యమంగళ స్వరూపుడు. విశిష్టాద్వైతంలోని ప్రధాన అంశం మరొకటి ఉంది. అది పరమాత్మ విశ్వానికంతకు తానే శరీరం. ఈయన పరవాసుదేవుడుగా వైకుంఠంలో లక్ష్మీదేవి, భూదేవి, నీళాదేవి, అనంత, గరుడ, విష్వక్సేనులతో కలిసి ఉంటాడు. ఈయనకు వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చమూర్తి అనే నాలుగు అవతారాలు. ఇందులో వ్యూహము సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధులనే మూడు విధాలుగా ఉంటుంది. సంకర్షణుడు జీవతత్త్వానికి, ప్రద్యుమ్నుడు మనస్తత్త్వానికి అభిమాన దేవతలు. అనిరుద్ధుడు జగద్రక్షకుడు.

రాముడు, కృష్ణుడు మొదలైన అవతారాలు విభవావతారాలు. హృదయాంతర్గతుడైన భగవత్తత్త్వమే అంతర్యామి. దివ్యదేశాలైన తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీరంగంలో శ్రీరంగనాథుడు, కంచిలోని వరదరాజ స్వామి ఇత్యాదులు అర్చావతారములు.

మరి శ్రుతి 'యతోవాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ' అని చెబుతుంది కదా. పరమాత్మ నిరాకారుడు గనుక ఆయన్ని

మాటలతో వర్ణించడానికి గాని మనస్సుతో ఊహించడానికి కాని శక్యం కాదు అని అర్థం కదా! అంటే అది సరికాదు అంటారు విశిష్టాద్వైతులు. దీని అర్థం ఆయన దివ్యమంగళ స్వరూపాన్ని అనంత కళ్యాణగుణాలను మాటలతో వర్ణించడానికి గాని మనస్సుతో ఊహంచడానికి గాని శక్యం కాదని దాని అర్థం. అదే శ్రుతి, తరువాత 'సత్యం, జ్ఞానం, అనంతం, బ్రహ్మ' అని పరమాత్మ స్వరూప లక్షణాలను చెప్పింది కదా! అందుచేత శ్రుతి వాక్యాలకు పరస్పర విరుద్ధమైన అర్థాలు కాక సమన్వయ దృష్టితో పరిశీలించినప్పుడు ఆయనకు దివ్యమంగళ స్వరూపం ఉందని, దాన్ని వీక్షించడానికి దివ్యదృష్టి కావాలని, భగవద్గీతలోని విశ్వరూప సందర్శన యోగం వివర్తిస్తుందని విశిష్టాద్వైతం వివరిస్తుంది.

ఇక విశిష్టాద్వైతంలో లక్ష్మీదేవికి, భక్తులకు సంబంధించి నంతవరకు, పరవాసుదేవుని కంటె విశిష్ట స్థానం ఉందని చెప్పాలి. జ్ఞానము, శక్తి, కరుణ పరవాసుదేవుని దివ్యలక్షణాలైతే, తల్లిది మాతృ వాత్సల్యం. ప్రపంచంలో పాపాలు చెయ్యని వారెవరు? అందరు ఏదోపాపం చేసినవాళ్ళే. వారు క్షమించమని సర్వస్వతంత్రుడైన శ్రీమన్నారాయణుడిని వేడినా ఆయన సుముఖంగా ఉండడట. అమ్మ కరుణించి క్షమించమని భర్తకు నివేదిస్తుంది. అంతే క్షమాభిక్ష దొరుకుతుంది. దీన్ని శ్రీవైష్ణవ సాంప్రదాయంలో 'పురుషకారం' అంటారు. ఆమె నిరంతరం స్వామి చెంతనుండి భక్తులను కాపాడుతుంది. ఈమె ద్వారానే భక్తులు తమ కోర్కెలు తీరేందుకు స్వామి నాశ్రయించాలి. ఈదివ్య

దంపతులిద్దరు శ్రీవైష్ణవ సంప్రదాయంలో ఆరాధనీయులు- వారికే శరణాగతిని చెయ్యాలి. ఏ సిద్ధాంతానికి చెందినవారైనా చివరికి ఈ భక్తి మార్గానుయాయులే అవుతున్నారనేది అక్షరసత్యం. దీనివల్లే విశిష్టాద్వైతం శుష్క వేదాంతం కాకుండా దైవభక్తి, విశ్వాసాలతో కూడిన సజీవ తత్త్వంగా, మతంగా మారిందని, ఆపదలో నున్న వారికి ఒక అనిర్వచనీయమైన ధైర్యాన్ని, అభయాన్ని ఇస్తుందని విజ్ఞుల అభిప్రాయం. అద్వైతులు సహితం ఆపత్కాలంలో సగుణ, సాకార దైవాన్ని భక్తి ప్రవత్తులతో ఆరాధించడం సర్వసామాన్యం.

ఇక్కడ ఒక విషయం వివరించాలి. భగవంతుడు సశరీరి అన్నాం కదా! మరి ఆయన కూడా ఇతర శరీరధారులవలె సుఖదుఃఖాలకు లోనౌతాడా అంటే కాదు అని సమాధానం. కారణం సుఖదుఃఖాలు కర్మను బట్టి వస్తాయికాని దేహధారిత్వం వల్లకాదు. ఆయనే కర్మాధ్యక్షుడైనప్పుడు ఆయనకు సుఖదుఃఖాలేమిటి? ఆయన జీవులకు కర్మానుసారంగా సుఖదుఃఖాలను కలుగజేస్తాడు. జీవులు తమ పూర్వవాసనానుసారం నడుచుకుంటూ పాపపుణ్యాలను చేస్తూ ఉంటారు. వాటి ప్రతిఫలం అనుభవిస్తూ ఉంటారు. పరమాత్మ దానికి బాధ్యుడు కాదు.

7. పరమాత్మ అనంత కళ్యాణ గుణ సమన్వితుడు

పరమాత్మకు ఈ కళ్యాణ గుణాలున్నాయనిచెప్పుకుంటాం గాని అవన్నీ ఆయనకున్న అన్ని గుణాలు అనికాదు. ఆయన కళ్యాణ గుణాలు అనంతం అని

విశిష్టాద్వైతం. అయితే ముఖ్యమైన గుణాలను పండితులు, పరమభక్తాగ్రేసరులు అయిన వైష్ణవ స్వాములు వర్ణించారు. వాటిని కపిస్థలం దేశికాచార్య స్వామి వారు వివరించారు.

అందులో ముఖ్యమైనవి సర్వజ్ఞత్వం- అంటే ఆయనకు తెలియనిది లేదు; సర్వశక్తిత్వం- ఆయన చెయ్యలేని కార్యం లేదు; సర్వసంకల్పత్వం- ఆయన సంకల్పించిన మాదిరిగానే కార్యాన్ని చక్క బెట్టగలగడం; ఉదార స్వభావం- ఆశ్రయించినవారికి కోరినదానికంటె అధికంగానే ఇచ్చి నేనిచ్చిందేముందిలే అనుకోవడం; కృతజ్ఞత- ఏ చిన్న సేవచేసినా, దాన్ని అధికంగానే తలంచడం; వాత్సల్యం- భక్తుల దోషాలను పెద్దగా పట్టించుకోకపోవడం; సౌలభ్యం- తలంచినంతమాత్రం చేత భక్తుల చెంతజేరి కాపాడడం (ఇది గజేంద్ర మోక్షంలో కనిపిస్తుంది); ఆశ్రితపారతంత్ర్యం- తన గొప్పతనాన్ని పట్టించుకోకుండా, ఎంత సామాన్యులకైనా సహాయం చెయ్యడం, (ఇది కుచేలోపాఖ్యానంలో కనిపిస్తుంది). ఆయన అనంత కళ్యాణగుణాలలో ఇవికొన్ని. విష్ణుసహస్ర నామంలో ఇంకా ఈ గుణాలను విస్తృతంగా భీష్మాచార్యులు వారు వివరించారు. అవీ సమగ్రం కాదంటారు పెద్దలు.

మరి బ్రహ్మం 'నిర్గుణుడు' అని శ్రుతిచెప్తుంది కదా అంటే నిజమే. గుణాలు అంటే ఏమిటి? సత్త్వ రజస్తమోగుణాలు. అవి ప్రకృతిలో ఉంటాయి. కనుక మానవులలో కూడా ఉంటాయి. మరి ఇలాంటి ప్రాకృతములైన గుణాలను పరమాత్మకెలా

ఆపాదిస్తారు? 'నిర్గుణుడు' అంటే ప్రాకృతములైన గుణాలు లేనివాడనే అర్థం. అలాగని ఆయనలో ఏ ఉత్తమ గుణాలు లేవని కాదు. ఆయనలో దయాగుణం లేదంటారా, క్షమాగుణం లేదంటారా! అంతకన్నా అపచారం ఇంకొంకటి ఉందా? ఆయనలో ఆగుణాలు లేవంటారా? క్షమాగుణం ప్రత్యక్షంగా కనిపిస్తూనే ఉంది కదా! తిరుమల కొండపైన అశేష భక్తజన సందోహం స్వామి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించి, కామితార్థాలను తీర్చుకోవడం మనం ప్రత్యక్షంగా చూస్తూ ఉంటే ఇంతకన్నా ప్రత్యక్ష ప్రమాణం ఏం కావాలి? విశిష్టాద్వైతం చెప్పేది శిరోధార్యం.

అద్వైతులు నిర్గుణ నిరాకార బ్రహ్మాన్ని సిద్ధాంతపరంగా ఆమోదించినా, నిత్య జీవితంలో వారు కూడా విశిష్టాద్వైత సిద్ధాంతంలోని సగుణ, సాకార బ్రహ్మాన్ని ఆరాధిస్తున్నారనే సత్యాన్ని కాదనలేం కదా! దీనికి కారణం శ్రీ శంకర భగవత్పాదులు కూడా విగ్రహారాధనను సమర్థించడమే!

8. జీవాత్మ పరమాత్మ ఒకటి కాదు

పరమాత్మ సర్వవ్యాపి. తద్విరుద్ధంగా జీవాత్మ అత్యంత సూక్ష్మంగా ఉంటాడు. రెండూ అవయవ రహితమైన చైతన్య స్వరూపాలే. ఇద్దరూ జ్ఞానస్వరూపులే. అయితే వీరిద్దరు ఒకటే అనుకోకూడదు. పరమాత్మ ఒకే ఒకడు. ఆయన కంటే గొప్పవాడు గాని సమానుడుగాని మరియొకడు లేదు. అయితే జీవాత్మలు మాత్రం అనంతం. ఎన్ని జీవులుంటే అన్ని జీవాత్మలుంటాయి.

బహువచనం 'జీవాత్మ' కే వర్తిస్తుంది కాని పరమాత్మకు కాదు. జీవాత్మ అణుస్వరూపుడు అనే విషయంలో సిద్ధాంత భేదాలున్నాయి. బ్రహ్మం అంతఃకరణాన్ని ఉపాధిగా చేసుకొని జీవత్వాన్ని అణుస్వరూపాన్ని పొందిందని అందుచేత ఈ అణుత్వం అనేది ఉపాధి దోషం వల్ల సంభవించిందని అద్వైతులవాదన. కాని ఈ వాదాన్ని విశిష్టాద్వైతులు నిరాకరించారు. పరమాత్మ జీవాత్మ వేరు గనుక జీవాత్మకు గల అణుత్వం స్వాభావికమే గాని ఔపాధికం కాదని సిద్ధాంతీకరించారు. స్మరణశక్తి ప్రాకృత శరీరానికి చెందింది గనుక జీవులకు పూర్వజన్మ జ్ఞానం ఉండదు.

ఇక జీవాత్మ పరమాత్మలు వేరనడానికి ముండకోపనిషత్తు లోని ఈ మంత్రాన్ని విశిష్టాద్వైతులు ఆధారంగా చేసుకుంటారు.

ద్వా సుపర్ణా సయుజా సఖాయా
సమానం వృక్షం పరిషస్వజాతే !
తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి
అనశ్నన్నన్యో అభిచాకశీతి ॥ (5.1)

సమాన గుణములు గలిగిన రెండు అందమైన పక్షులు అన్యోన్యంగా ఒకే వృక్షంమీద నివసిస్తున్నాయి. అందులో ఒక పక్షి ఫలాలను ఆరగిస్తూ ఉంటే రెండవపక్షి పళ్ళను తినకుండా నిర్లిప్తంగా వెలుగొందుతూ ఉంది. ఒక లోతైన వేదాంత విషయాన్ని శ్లోకరూపంలో అందించిన ఒక అందమైన ప్రకృతి చిత్రం ఈ శ్లోకం. సారస్వతపరంగా రూపకాలంకారంలో అందించిన వేదాంత విషయం.

ఇందులో వృక్షం శరీరానికి ప్రతీక. ఫలాల నారగించే పక్షి కర్మఫలాలను అనుభవించే కర్తయైన జీవాత్మను సూచిస్తుంది. నిర్లిప్తంగా చూస్తూ తేజోవంతంగా ఉండే పక్షి కర్మాచరణచేత కళంకం పొందకుండా తేజోవంతంగా ఉండే పరమాత్మ. కర్మలకు వాటిఫలాలకు లోనైన వాడు గనుక జీవుడు సుఖదుఃఖాలకు లోనై నిస్తేజంగా అజ్ఞానాంధకారంలో ఉంటాడు. పరమాత్మ కర్మపరాధీనుడు కాడు గనుక సుఖదుఃఖాలకు లోను కాకుండా, సాక్షీ భూతుడుగా జ్ఞాన స్వరూపుడుగా వెలుగొందుచూ ఉంటాడు.

ఈ మంత్రంలో జీవాత్మ పరమాత్మలు వేరని ద్వివచనంలో సూచించబడింది. నిజానికి జీవేశ్వరులిద్దరికి జ్ఞానం సమానధర్మమే. అయితే జీవుడు దుష్కర్మల ఫలితంగా జ్ఞానవిహీనుడౌతున్నాడు, శోభారహితుడౌతున్నాడు. పరమాత్మ శరీరంలో హృదయ కుహరంలో ఉన్నా కేవలం నిర్లిప్త సాక్షీభూతుడే గనుక కర్మ పరాధీనుడు కాకుండా ఆనంద స్వరూపుడుగానే ఉంటున్నాడు. అయితే ఈ జీవాత్మలు స్వతహాగా జ్ఞానస్వరూపులే అయినా కర్మానుసారంగా, మనుష్యులుగా పుట్టవచ్చు, అనేక రకాలైన జంతువులుగా నైనా పుట్టవచ్చు. ఈ పుట్టుకలను బట్టి ఉపాధికి తగిన జ్ఞానమే ఉంటుంది - హెచ్చు తగ్గులుంటాయన్నమాట.

ఇలాగే కఠోపనిషత్తులో (5.13) ''నిత్యో నిత్యానాం చేతన శ్చేతనానాం, ఏకో బహూనాం యో విదధాతి కామాన్'' అని ఉంది. నిత్యుడైన ఒక చేతనుడు (పరమాత్మ), నిత్యులైన లెక్కలేనన్ని చేతనులకు (జీవులకు) అర్థించిన ఫలాలను ప్రసాదిస్తున్నాడని

జీవేశ్వర భేదాన్ని సూచిస్తుంది. భగవద్గీతలో, ముఖ్యంగా శ్వేతాశ్వతరోపనిషత్తులో జీవాత్మ పరమాత్మలు వేరని సూచించే వాక్యాలు అనేకం. ఉదాహరణకు భగవద్గీతలోని ఈ శ్లోకాన్ని చూడండి.

శ్లో. **తేషామహం సముద్ధర్తా మృత్యుసంసారసాగరాత్ ।**
భవామి నచిరాత్ పార్థ మయ్యా వేశితచేతసామ్ ॥

ఓ అర్జునా, నాయందే మనస్సు లగ్నం చేసిన పరమ భక్తులను, ఈ సంసార కూపం నుండి రక్షిస్తాను అన్నాడు. ఈ శ్లోకంలో జీవాత్మ - పరమాత్మల భేధం స్పష్టం.

9. జీవుడు

అయితే జీవాత్మ, పరమాత్మ వేరనుకున్నపుడు వీరిద్దరి మధ్య అనుబంధం ఏమిటి? జీవుడు స్వతంత్రుడా? తన ఇచ్ఛానుసారం సకల సౌఖ్యాలు కలిగించుకొని స్వేచ్ఛా జీవితం గడపగలడా? అంటే కాదంటుంది విశిష్టాద్వైతం. ప్రతి జీవుడు పుణ్యపాపకర్మల నాచరించేవాడే. జీవుడి స్వభావం అతని పూర్వ వాసనల మీద ఆధారపడి ఉంటుంది. ఆ స్వభావానుసారం అతను ప్రవర్తించి కర్మాచరణ చేస్తూ ఉంటాడు. ఆ కర్మాచరణలో పరమాత్మ ప్రమేయం ఉండదు. అంతవరకు మాత్రమే జీవుడికి స్వేచ్ఛ ఉందని చెప్పాలి. మరి ఆ కర్మానుసారం ఫలితాల ననుభవింపజేసే శక్తి సామర్థ్యాలు గల విశిష్ట వ్యక్తి ఒకడుండాలి కదా! ఆయనే పరమాత్మ - సర్వ స్వతంత్రుడు, ఒక విధంగా చూస్తే నియంత! ఆయన కర్మానుసారం జన్మను, సుఖదుఃఖాలను

కలుగజేస్తాడు. ఈ విషయంలో ఆయన నిష్పక్షపాతి. అందుచేత జీవుడు పరతంత్రుడే గాని స్వతంత్రుడు కాదు.

జీవుని ప్రధాన లక్షణం 'అహంకారం' లేక 'అహంబుద్ధి' అంటే తాను కర్త అనే జ్ఞాతృత్వం. ఇది అతనిలో అంతర్నిహితంగా ఎప్పుడూ వీడకుండా ఉంటుంది. ఇది లేకపోతే మోక్ష ప్రయత్నమే ఉండదు.

ఇది ఉండబట్టే కర్తృత్వభావంతో కర్మల నాచరించి వాటి ఫలితాలననుభవిస్తున్నాడు. విశిష్టాద్వైతంలో ఇది బంధమోక్షాల రెండింటిలోనూ ఉంటుంది. దేవుని ప్రమేయం లేకుండా కర్మానుసారం జీవుడు ప్రవర్తిస్తుండడం దేవుని పరిపూర్ణతకు లోటు కాదా? అంటే కాదంటుంది. దీనికి కారణం దేవుడే కర్మసూత్రాన్ని తన ఇచ్ఛానుసారం ప్రవేశపెట్టి తాను 'కర్మాధ్యక్షుడు' గా ఉంటున్నాడు గనుక తాను ప్రవేశపెట్టిన నియమాన్ని ఆయన ఉల్లంఘించడు. అది ఆయన నియమం. అందుచేత జీవుడు చేసే కర్మలకు ఆయన బాధ్యుడు కాడు.

విశిష్టాద్వైతంలో శేష-శేషి భావం ఒక ప్రధానాంశం. జీవుడు పరమాత్మకు దాసుడు - శేషభూతుడు అంటారు. సృష్టి, స్థితి, లయకారకుడైన పరమాత్మ 'శేషి'. ఈ శేషభూత భావం కేవలం పరమాత్మకే కాదు, పరమాత్మ భక్తులకుకూడా వర్తిస్తుంది. ప్రతి వైష్ణవుడు ముందుగా భక్తులకు శేషభూతుడు - అంటే భగవద్భక్తి కంటె భాగవత భక్తి మిన్న అనే సిద్ధాంతానికి విశిష్టాద్వైతంతో ప్రాధాన్యత ఎక్కువ. ఇక్కడ భక్తుల కులం ప్రధానం కాదు.

సోమశర్మ అనే నైష్ఠిక బ్రాహ్మణుడు కర్మలోపం చేత బ్రహ్మరాక్షసుడై ఒక మాలదాసరిని ఇలా ప్రార్థిస్తాడు (ఆముక్తమాల్యదలో)

క. **మీవంటి భాగవతులుం**
బావనులుగ జేయరేని మరిగతి యేదీ
మావంటి వారికి, ఇక మా
యేవము వెనుకటిది చూడక ఈక్షింపు కృపన్. (6.55)

ఇక మరొక ముఖ్యమైన విషయాన్ని మనం చర్చించాలి. అద్వైతంలో బింబ ప్రతిబింబవాదం అనేది ఉంది. మన ముఖం అద్దంలో ప్రతిబింబిస్తుంది. ఆ ప్రతిబింబం జీవుడు. అసలు ముఖం పరమాత్మ. ముఖం ప్రక్కకు తొలిగితే అద్దంలో ముఖం మాయమౌతుంది. అంటే జీవుడు పరమాత్మ యొక్క ప్రతిబింబమే కాని అతనికి స్వతంత్ర ప్రతిపత్తిలేదు. ఈ బింబ ప్రతిబింబ వాదాన్ని రామానుజులు తిరస్కరించారు. ''పరబ్రహ్మాంశమైనను, జీవాత్మ యథార్థము, అనన్యము, నిత్యము, బుద్ధిజ్ఞానసహితము, నిరవయవము, నిర్వికారము, అగోచరము, అణుస్వరూపమైనది. అది దేహేంద్రియ ప్రాణబుద్ధులకు వేరైనది. అది జ్ఞాత, కర్తయు, భోక్తయునై యున్నది. మానవునిలో స్థూలదేహమునకును, ప్రాణమునకును, పంచ కర్మేంద్రియములకును మనస్సునకును నంటియున్నది. ప్రాణము నింద్రియముల వలె నుపకరణము మాత్రమే' నని రామానుజుల జీవ స్వరూపాన్ని రాధాకృష్ణ పండితులు వివరించారు. (భారతీయ తత్త్వశాస్త్రం Vol 5- పేజి 234-235)

మరి జీవేశ్వరులు ఒకటే అంటే పరమాత్మకు కూడా

బంధమోక్షాలు సుఖదుఃఖాలు ఆపాదించవలసి వస్తుంది. అందుచేత శాస్త్రాలలో జీవేశ్వరులు ఒకటే అని అనిపించే వాక్యాలు ఉంటే వాటిని సమన్వయించుకోవాలి. జీవుడు, ప్రకృతి విశేషణాలు: పరమాత్మ విశేష్యం. ఈ ముగ్గురిలో పరిణామం విశేషణాలకే గాని, విశేష్యమైన పరమాత్మకు కాదు. అయితే ఈ ముగ్గురికి విశ్వంలో ఒక విశిష్టమైన ఐక్యత ఉంది. అయితే అది స్వరూపైక్యత కాదు అని వ్యాఖ్యాతలు చెప్పినమాట.

ఇలా జీవాత్మ పరమాత్మ స్వభావ స్వరూపాలను, వారి మధ్య భేదాన్ని విశిష్టాద్వైతం వివరిస్తుంది. ఎంతటి అద్వైతి అయినా భగవంతుణ్ణి ప్రార్థించేటప్పుడు తాను వేరని భగవంతుడు వేరని, ఆయన ఉత్కృష్టుడనే భావనతోనే కదాపూజిస్తారు. అందుచేత సిద్ధాంతపరంగా అద్వైతులే అయినా వ్యవహారపరంగా అందరూ విశిష్టాద్వైతులే అని అంటారు వైష్ణవులు. ఇందులో కొంత నిజం లేకపోలేదు.

10. మరి 'తత్త్వమసి' మాటేమిటి?

మరి ఛాందోగ్యంలో 'తత్త్వమసి' ఆ బ్రహ్మము నీవే అయిఉన్నావు - జీవాత్మ పరమాత్మలకు భేదము లేదు అని కుండ పగులగొట్టినట్లు చెప్తూ ఉంటే, కాదు జీవాత్మ పరమాత్మ వేరని సిద్ధాంతీకరించడం శ్రుతి విరుద్ధం కాదా అనే జటిలమైన ప్రశ్న ఉత్పన్నమౌతుంది. దీనికి సహేతుకమైన సమాధానం చెబితేనే విశిష్టాద్వైతం యొక్క పునాది నిలుస్తుంది. మరి వారేమంటున్నారో చూద్దాం.

విశిష్టాద్వైత సిద్ధాంతం ప్రకారం నామరూపాత్మకంగా

సృష్టించబడిన జగత్తు బ్రహ్మమునకు శరీరం - ఆయన ఆత్మ లేక శరీరి. శరీర-శరీరి సంబంధం ఉండటం వల్ల బ్రహ్మము విశ్వము ఒక్కటే. అందుచేత 'తత్త్వమసి' అంటే నీవుకూడా బ్రహ్మమునకు శరీరమైన విశ్వంలోనే ఉన్నావు గనుక నీవు కూడా బ్రహ్మాత్మకుడవే అని అర్థం కాని 'నీవు ఆ బ్రహ్మమే అయిఉన్నావు' అని అద్వైతులు చెప్పినట్లు జీవాత్మ పరమాత్మల ఐక్యాన్ని ఛాందోగ్యోపనిషత్తు లోని 'తత్త్వమసి' అనే మహావాక్యం బోధించడం లేదు.

పరమాత్మ అద్భుతమైన శక్తి గలవాడు. ప్రళయం తరువాత తాను ఒక్కడుగా నున్నప్పుడు ఆ సూక్ష్మావస్థలో తనకు చేతనాచేతన శరీరం లేకపోవడం వల్ల తన లీలావిలాసానికి అనువుగా లేదని ఆయన 'తదైక్షత బహుస్యాం ప్రజాయేయేతి' అని తాను సమిష్టిగాను వ్యష్టిగాను ఉండే ఈ నామరూపాత్మక విశ్వంగా వ్యక్తమవాలని వీక్షణ పూర్వకంగా సంకల్పించాడు. అంతే! సృష్టి జరిగింది. ఆ సృష్టి పరమాత్మ శరీరమే సూక్ష్మదశ నుండి స్థూల దశపొంది ఆయనకోరుకున్నట్లు అనేకంగా వ్యక్తమయింది. అందులో 'తత్త్వమసి' నీవూ ఉన్నావు' అని శ్వేతకేతువుకి తండ్రి ఉపదేశించాడు. అంతేగాని ఆ పరమాత్మ నీవు ఒకటని కాదు.

ఈ మహాకావ్యంలో తత్=ఆ పరమాత్మ+త్వం=నీవు అని రెండిటిని చెప్పి పరమాత్మకు జీవాత్మకు భేదం సూచించబడింది.

తరువాత 'అసి', అయిఉన్నావు అని అభేదం కూడా సూచించబడింది. ఈ భేదాభేదాలకు సమన్వయమే విశిష్టాద్వైతం-

అదే 'ఈ పరమాత్మ సృష్టించిన విశ్వంలో నీవు ఒకడవై ఉన్నావు' అని, అంతేగాని ఆ పరమాత్మ నీవని కాదు.

పరమాత్మ సర్వజ్ఞుడు, జీవుడు సర్వజ్ఞుడు కాదు కదా! పరమాత్మ సృష్టికార్యం చెయ్యగలడు, జీవుడు చెయ్యలేడు కదా! మరి ఇద్దరూ ఒకటనడం అసంబద్ధం కదా! అలాగని జీవుడు జడపదార్థం కాదుకదా! అతను కూడా పరమాత్మ శరీరంలో భాగమే కదా. ఆ విధంగా చూసినపుడు ఆయనకు పరమాత్మకు శరీర-శరీరి సంబంధం ఉంది. అందుచేత జీవుడు విశ్వం అనబడే ఈ పరమాత్మ శరీరంలో భాగమే. ఇదే విశిష్టాద్వైతంలో 'తత్త్వమసి'కి అర్థం. విశిష్టాద్వైతం, అద్వైతంలాగ జీవాత్మ పరమాత్మల స్వరూపైక్యం ఒప్పుకోదు, ద్వైతంలాగ వారిద్దరూ పూర్తిగా వేరు వేరు తత్త్వాలనీ ఒప్పుకోదు. వారిద్దరు ఒక విధంగా వేరు, ఒక విధంగా ఒకటి అదే శరీర-శరీరి సంబంధం - విశిష్టాద్వైతం-ఒక విశిష్టతతో కూడిన అద్వైతం. అనేకాంశాలతో కూడిన వస్తువులో, విడివిడిగా ఆ అంశాలన్నీ ఆ వస్తువుకు విశేషణాలు, ఆ వస్తువు మొత్తం ఆ విశేషణాలతో కూడి విశిష్ట వస్తువు. చెట్టు ప్రధానం, ఆకులు అప్రధానం, కాని చెట్టుకు విశేషణాలు. చెట్టు విశేష్యం. ప్రకృతి జడం, జీవుడు సూక్ష్మం, పరమాత్మ సర్వ సమర్థుడైన కర్త. ముగ్గురు పారమార్థిక సత్యాలే. ప్రకృతి జీవుడు విశేషణాలు, పరమాత్మ విశేష్యం, అంటే ఆ రెండింటితో కూడిన విశిష్ట పురుషుడు. ఈ మూడు తత్త్వాలకు ఒక విశిష్టమైన ఐక్యత చెప్పడమే విశిష్టాద్వైతమని వ్యాఖ్యాతలు చెప్పారు! ఆ విశిష్ట వస్తువులో జీవుడు కూడా భాగమే గనుక 'తత్త్వమసి' అంటే ఆ

విశిష్ట వస్తువులో (పరమాత్మ చేత సృష్టించబడిన విశ్వంలో) నీవు కూడా భాగమే సుమా! కాని ఆ విశిష్టవస్తువు నీవు కాదు.

11. సృష్టి

రామానుజుల కాలంనాటికే సృష్టి ఎలా జరిగిందనే విషయంమీద అనేక మంది అనేక సిద్ధాంతాలను ప్రతిపాదించారు. జైమిని న్యాయదర్శనంలోనూ కణాదుడి వైశేషిక దర్శనంలోనూ పరమాణువుల సంయోగం వల్ల అంతకు ముందులేని వస్తువులు ఉత్పన్నమవుతున్నాయని, అలాగే ఈ పరమాణు సంయోగం వల్లే అంతకు ముందు లేని ఈ విశ్వం ఉత్పన్నమయిందని సిద్ధాంతరీకరించారు. దీనిని ఆరంభవాదం అంటారు. (దీనికి పీలుపాక వాదం అని మరొక పేరుంది. పీలువులు అంటే అణువులు) వీరు తార్కికులు, అసత్కార్యవాదులు.

ఇక సాంఖ్యులు నిరీశ్వరవాదులు. కపిల మహర్షి దీనికి ద్రష్ట. ప్రకృతి పురుషుల సంయోగం వల్ల, మూల ప్రకృతి పరిణామం చెంది పంచభూతాత్మకమైన ఈ విశ్వం రూపుదిద్దుకుందని వారివాదం. ఉన్న వస్తువే పరిణామం చెందిందని అన్నారు గనుక వీరిని సత్కార్యవాదులన్నారు.

మట్టి ఉపాదాన కారణం (material cause) కుమ్మరివాడు నిమిత్తకారణం (efficient cause), కుండ కార్యం (effect). దీన్ని సత్కార్యవాదం అంటారు. వేదాంతులు బ్రహ్మము

'ఏకమేవ అద్వితీయం' అని శ్రుతి చెప్పినట్టు ఒకటిగా ఉన్న తానే అనేకత్వం పొంది నామరూపాత్మక విశ్వాన్ని ఆవిర్భవింప చేశాడని అంటారు. ఇందులో ఉపాదాన కారణం నిమిత్త కారణం రెండూ ఒకటే.

అయితే తార్కికులు అణువులే ఉపాదాన కారణమని, పరమాత్మ నిమిత్త కారణమని, అంటారు - రెండు కారణాలు ఒకరే అయి ఉండడం అసంబద్ధం అని వీరి వాదం. అందుచేత వేదాంతులు సృష్టికార్యంలో పరమాత్మ ప్రమేయ మున్నంతవరకు మాత్రమే ఒప్పుకుని, పరమాణు వాదాన్ని తిరస్కరించారు.

ఇక సాంఖ్యుల పరిణామవాదం కూడ దోషభూయిష్ఠ మైనది. ప్రకృతిజడపదార్థం, జీవుడికి జ్ఞానం ఉన్నా అది స్వల్పం, అంతేగాక అతడు కర్మచేత బంధించబడిన వాడు. అందుచేత ఇద్దరికి సృష్టి కార్యం చేసే శక్తిలేదు. సర్వసమర్థుడైన కర్త ఒకడు కావాలి - అతడే పరమాత్మ-ఆయన ఇచ్ఛలేనిదే సృష్టి అసంభవం. అయితే ప్రకృతి విశ్వంగా పరిణామం చెందుతున్నంతవరకు సాంఖ్యం, వేదాంతులకు ఆమోదయోగ్యమే.

శంకరులు బ్రహ్మము మాయ (ప్రకృతి)తో చేరి సగుణ బ్రహ్మంగా మారి సృష్టి కార్యాన్ని తన ఇచ్ఛాను సారంగా చేసాడని చెప్పారు. బ్రహ్మమే విశ్వంగా మారింది గనుక దీన్ని వివర్తవాదం అని అంటారు.

ఇదంతా రామానుజులు సృష్టికార్యం మీద వారి వివరణ ఇవ్వడానికి ముందున్న పూర్వరంగం.

రామానుజులు సత్కార్య వాదాన్ని అంగీకరించారు. అద్వైతంలో జీవుల అనుభవంలోకి రాని కర్మానుభవానికి, మాయప్రేరేపించగా సృష్టి జరిగిందనే శంకరుల వాదాన్ని రామానుజులు అంగీకరించరు.

'యతో వా ఇమాని భూతాని జాయంతే! యేన జాతాని జీవంతి।
యత్ప్రయంత్యభినం విశంతి। తద్వి జజ్ఞాసస్వ । తద్బ్రహ్మేతి!' -

దేని నుండి ఈ జీవజాలం పుట్టి, దేనివల్ల వర్ధిల్లి, చివరికి దేనిలో లయం అవుతుందో ఆయనే పరమేశ్వరుడు, లక్ష్మీపతియైన శ్రీమన్నారాయణుడు. ఆయనే సృష్టి, స్థితి, లయాలకు కారకుడు. అయితే ఆయనలో సత్వరజస్తమాలనే ప్రాకృతమైన గుణాలు లేవు. జీవులందరిలోనూ ఈ గుణాలుండాలి, ఉంటాయిగూడ. అందుచేత పరమేశ్వరుడు త్రిగుణాత్మకమైన మూలప్రకృతిని ఆధారంగా చేసుకుని తన వీక్షణ మాత్ర సంకల్పంతో సృష్టికార్యాన్ని చేస్తున్నాడు. ఆయనే స్వయంగా ఈ సృష్టికార్యాన్ని తన ఇచ్ఛామాత్రం చేస్తున్నప్పుడు విశ్వం సత్యంకాదు, మిథ్య అనేది అంగీకారయోగ్యం కాదు. సత్యంకాని వస్తువును సృష్టించడమేమిటి! అలాంటి ఆలోచన హాస్యాస్పదమైనది నామరూపాత్మకమైన ఈ మహా విశ్వాన్ని తన విచిత్రశక్తిచే సృష్టిస్తుంది. గనుక మూలప్రకృతిని మాయ అని సంబోధిస్తున్నారుగాని, అది అసత్యం అనే అర్థంలోకాదు. భగవద్గీతలో పరమాత్మే ఇలా చెప్పాడు.

మమ యోనిర్మహద్బ్రహ్మ తస్మిన్ గర్భం దధామ్యహమ్ ।

సంభవః సర్వభూతానాం తతో భవతి భారత ॥(భ.గీ. 14.3)

'ఓ అర్జునా! మూలప్రకృతి విశ్వానికి మూలకారణం. దానిలో చేతన సముదాయమైన జీవజాలాన్ని బీజరూపంలో ఉంచుతాను. ఇలా జడచేతన సంయోగంతో, జడచేతన రూపమైన విశ్వం ఉత్పన్నం అవుతుంది' అని పరమాత్మ స్వయంగా ప్రకటించాడు. తరువాతి శ్లోకంలో అనేక యోనుల నుండి జన్మించే జీవజాలానికి మూలప్రకృతి తల్లి, నేను బీజాన్ని ఉంచే తండ్రిని అని స్పష్టంగా చెప్పాడు. భార్య ఎప్పుడు భర్త వశంలో ఉండేదే కదా, భార్యను భరించేవాడు భర్తేకదా! అందుచేత మూలప్రకృతి తన ఆధీనంలో ఉంటుందనే విషయాన్ని పరమాత్మ స్పష్టీకరించాడు. సగుణబ్రహ్మం, నిర్గుణబ్రహ్మం అనేవి సృష్టి విషయంలో అద్వైతంలో ఉన్నాయిగాని, విశిష్టాద్వైతంలో ఉన్నది శ్రీమన్నారాయణుడే, ఆయనే పరబ్రహ్మం, సృష్టికర్త.

ప్రకృతి పంచభూతాలుగాను, జీవజాలంగాను సృష్టి సమయంలో వికారాలు పొందుతుంది. ఇలా చేతనాచేతన విశ్వంగా మారినప్పుడు అది స్థూలావస్థ పొందిందని అంటారు. సృష్టి లయం అయినప్పుడు ఈ వికారాలన్నీ నశించి ప్రకృతి తన నిజస్థితియైన సూక్ష్మావస్థకు చేరుకుంటుంది. జీవుడు కూడా శరీరం ఉపాధిగా తీసుకున్నప్పుడు స్థూలావస్థలోనూ, శరీరం త్యజించిన తరువాత సూక్ష్మావస్థలోనూ ఉంటాడు.

ఈ జీవజాలం పరమాత్మకు శరీరం. విశిష్టాద్వైతంలో జీవులు పరమాత్మ శరీరులని ఇదివరకే చెప్పుకున్నాం. అయితే ప్రళయం సంభవించినప్పుడు, పరమాత్మ శరీరమైన చేతనాచేతన

ప్రకృతి సూక్ష్మావస్థలో ఉండి పరమాత్మకు లీలానుభూతిని కలిగించలేవు. అప్పుడు పరమాత్మ తన క్రీడానుభవానికి సృష్టికార్యం చేస్తాడు. మరి సృష్టి భగవంతుని లీల అయినప్పుడు, జీవులను కొందరిని సుఖాలనుభవించేవారుగా, కొందరిని దుఃఖభోగులగా ఎందుకు సృష్టించాడంటే దానికి ఆయన భాధ్యుడు కాదు. మానవుల పుట్టుక కర్మానుసారమే జరుగుతుంది. ఆయన కార్యం జీవులను సృష్టించడం, వాటిలో జీవాత్మను ప్రవేశపెట్టి జ్ఞానం, చైతన్యం ఇవ్వడం వరకే. పరమాత్మ సూక్ష్మచేతనాచేతన అవస్థనుండి స్థూల చేతనాచేతనావస్థకు చేరడమే సృష్టి. అందుచేత కారణం, కార్యం, రెండూ కూడా ఆయనే.

ఈ సృష్టిలో ఉండేవారు ముగ్గురు - పరమాత్మ, జీవుడు (చేతనులు), ప్రకృతి (జడం) అనే తత్త్వత్రయం. వీరిలో పరమాత్మ మాత్రమే స్వతంత్రుడు, మిగతా ఇద్దరు ఆయన ఆధీనంలోనుండేవారే, పరమాత్మకు శరీరభూతులు. ప్రాకృతమైన గుణాలులేని పరమాత్మ, ప్రాకృత గుణాలు గల చేతనాచేతన ప్రకృతి రెండు సృష్టిలో ఒకటిగా ఉండడం అద్వైతం, అయితే ఈ చేతనాచేతన ప్రకృతి ఆయన శరీరంగా ఉండడం విశేషం - అందుచేత విశిష్టాద్వైతం.

ఈ సృష్టిని పరిశీలిస్తే జగత్తుకు బ్రహ్మమునకు విడదీయరాని సంబంధం ఉందనే విషయం స్పష్టమవుతుంది. ఏకత్వం నుండి బహుత్వం వచ్చిందంతే. ఇదే పరిణామం వివర్తం. అవ్యాకృత బ్రహ్మం ఎంత సత్యమో వ్యాకృత బ్రహ్మం కూడా అంతే

సత్యం. పరిణామం చెందినంత మాత్రంచేత పరమాత్మ మిథ్య అయిపోతాడా! అందుచేత విశ్వం మిథ్య అనడం అంగీకారయోగ్యం కాదు. పరమాత్మచే సృష్టించబడిన ఈ విశ్వం సత్యమే అని రామానుజుల సిద్ధాంతం.తార్కికంగా చూసినపుడు ఈ సిద్ధాంతంలో బలం కనిపిస్తుంది. అద్వైతులు దీన్ని ఒక వివేక విశిష్టమైన సిద్ధాంతంగా చూడాలే తప్ప, తిరస్కరించడం న్యాయం కాదు అని కొందరికి అనిపిస్తుంది.

12. భక్తి-ప్రపత్తి

జీవులలో మూడు రకాలుంటారని విశిష్టాద్వైత సిద్ధాంతం. వారు నిత్యముక్తులు, ముక్తులు, బద్ధులు. ఇందులో నిత్యముక్తులు సంసారబంధమనేది ఎప్పుడూ లేక నిత్యం వైకుంఠంలో పరమానందంగా ఉంటారు. భక్తి ప్రవృత్తులతో క్రమేణా కర్మబంధాలను తెంచుకుని మోక్షం పొందినవారు ముక్తులు. సంసారంలో చిక్కుకుని, కర్మబంధంలో ఉండి జననమరణ వలయంలో చిక్కుకున్నవారు బద్ధులు.

జీవేశ్వరులకిద్దరికి జ్ఞానమనేది సమానధర్మం. జీవులలో ఈ జ్ఞానం దీపంలా వెలుగునిచ్చేది ఒకటి, దానితోటి రత్నంలోని ప్రభలాగా సంకోచ వికాసాలు గల జ్ఞానం కూడా ఉంటుంది. దీన్ని 'ధర్మభూతజ్ఞానం' అంటారు. ఈ జ్ఞానంతోనే జీవులు బాహ్యావస్తువులను గ్రహిస్తారు. ఈ ధర్మభూతజ్ఞానం వికాసం పొందనప్పుడు జీవాత్మ తాను ఈ శరీరం కంటె వేరని అనుకోడు. దీన్ని దేహాత్మభావం అంటారు. ముక్తి పొందాలంటే ఈ

ధర్మభూతజ్ఞానం వికాసం చెంది తాను ఈ శరీరం కంటె వేరని, తాను పరమాత్మ శరీరం గాని వేరుకాదని శరీర-శరీరి జ్ఞానం జీవాత్మకు కలగాలి. అయితే ఈ 'ధర్మభూతజ్ఞానం' అనే సిద్ధాంతం విశిష్టాద్వైతంలోనే కనిపిస్తుంది.

సాధారణంగా జీవుడు కర్మలు చేస్తూ ఉంటాడు. సుఖదుఃఖాలు అనుభవిస్తూ ఉంటాడు. కర్తృత్వ భోకృత్వ భావాలు కలిగి ఉంటాడు. దీని పర్యవసానం, జననమరణ శీలం గలిగిన సంసారం. పునర్జన్మ పొందినప్పుడు కొత్త శరీరం వస్తుంది గాని సూక్ష్మశరీరం మాత్రం అన్ని జన్మలతోనూ తనను వెన్నంటే ఉంటుంది. ఇది ప్రళయం వరకు అలాగే ఉండి ప్రళయ సమయంలో మూలప్రకృతిలో లయమై ఉంటుంది. అయితే ఇక్కడితో అయిపోలేదు. మళ్ళీ సృష్టి జరిగినప్పుడు కర్మబంధాలతోసహా పునర్జన్మ తథ్యం. మరి ఈ జననమరణ వలయం నుండి ముక్తి పొందటం ఎలా? దానికి మార్గం భక్తి ఒకటే అని రామానుజుల మతం.

రామానుజులు జ్ఞానమార్గం కర్మమార్గం వల్ల కాక భక్తిమార్గంలో పయనిచండం వల్లే ముక్తి ధామం చేరుకుంటామని ప్రవచించారు. దానికి భగవద్గీతలోని ఈ శ్లోకం ఉదాహరిస్తారు:

క్లేశోఽధికరస్తేషామ్ అవ్యక్తాసక్తచేతసామ్ ।
అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహ వద్భి రవాప్యతే ॥ (12.5)

నిరాకార బ్రహ్మము మీద ఆసక్తితో సాధన చెయ్యడం

శ్రమతో కూడిన పని అనిచెప్పి భక్తి మార్గాన్ని శరణాగతి తత్త్వాన్ని బోధించాడు శ్రీకృష్ణ పరమాత్మ. ఆదిశంకరులు తమ భజగోవింద శ్లోకాలలోనూ ఇతరత్రా ఈ మార్గాన్ని బోధించారు. అద్వైతి అయిన ధూర్జటి ఇలా అన్నాడు:-

శా. **ఏ వేదంబు పఠించేలూత, భుజగంబేశాస్త్రము ల్చూచె,దా**
నే విద్యాభ్యసనం బొనర్చెగరి, చెంచే మంత్ర మూహించె,

బో

ధా విర్భావ నిధానముల్ చదువులయ్యా! కావు! మీ పాదసం
సేవా సక్తియేకాక జంతుతతికిన్ శ్రీ కాళహస్తీశ్వరా!

ఇలా భక్తి మార్గానికి సర్వత్రా ఆమోదం ఉంది. అలాగని జ్ఞానకర్మమార్గాలు నిరర్థకం అని అనుకోకూడదు. అలా అనుకోవడం శ్రుతి విరుద్ధం కూడా. రామానుజులు శ్రుతివిరుద్ధంగా ఏ విషయం చెప్పలేదు. "ఆత్మావా అరే ద్రష్టవ్యః - శ్రోత్రవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యో మైత్రేయి!" ఆత్మను అనుభవపూర్వకంగా తెలుసుకోవాలి. ఆత్మకు సంబంధించిన శ్రుతివాక్యాలు వినాలి, వాటిని మననం చేసి, వాటిమీద ధ్యానం చెయ్యాలని శ్రుతి చెప్పింది. రామానుజులు ఈ వినడం, మననం, ధ్యానం, భక్తితో చెయ్యాలి అంటారు. ఆయన భక్తి అంగి అని; జ్ఞానం, కర్మ భక్తికి సాధనాలని అంటారు. జ్ఞానం, నిష్కామ కర్మ, సత్వగుణాన్ని పెంపొందించి, మనస్సుకు శాంతి కలిగించి భక్తి మార్గాన్ని సుగమం చేస్తాయని, భక్తికి మోక్షానికి విడదీయరాని సంబంధం ఉందని అన్నారు.

భగవంతుణ్ణి కీర్తించడం, నిత్యం పూజించడం, విగ్రహారాధన, భక్తిలో భాగాలే. అయితే చరమసోపానం ధ్యానం. అయితే ధ్యానానికి ఏ రూపము నిలువజాలదని రామానుజులు ఈ గురుప్రోక్త శ్లోకాన్ని ఉదాహరించారని రాధాకృష్ణ పండితులు వ్రాశారు:

"ఆ బ్రహ్మస్తంబ పర్యంతా జగదంతర్వ్యయస్థితాః ।
ప్రాణినః కర్మ జనిత సంసార వశంవర్తినః ॥
యతస్తతోనతే ధ్యానే ధ్యానినా ముపకారకాః।
అవిద్యాంతర్గతా స్సర్వే తే హి సంసారగోచరాః॥

''బ్రహ్మ మొదలు తృణపర్యంతము సర్వవస్తువులు కర్మజాతమగు సంసార పాశబద్ధములు. అవిద్యాంతర్గములై, సంసార సంగములైన యా వస్తువులు ధ్యానమునకుపకరించు వస్తువులు కావు.'' (భా.త.శా. 5-252 తి.తి.దే.)

ఇక జ్ఞానకర్మల మీద, చివరకు ధ్యానం మీద ఆధారపడిన భక్తి కూడా అందరికి సాధ్యం కాదని విశిష్టాద్వైతం ప్రపత్తి లేక శరణాగతి అందరికి తరించడానికి సులభమైన మార్గం అని ప్రవచించింది. దీనికి భగవద్గీతలోని ప్రసిద్ధమైన ఈ శ్లోకం ఆధారం:-

సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ!
అహం త్వా సర్వపాపే భ్యో మోక్షయిష్యామి మా శుచః ॥(భ.గీ.18.66)

శరణాగతిలో భరన్యాసం ఆ పరమాత్మ మీదే పెట్టి కర్తవ్యకర్మలను ఆయనకే సమర్పించి, ఆయన మీద అచంచల

విశ్వాసంతో ఉండడం సాధకుని కర్తవ్యం. పరమాత్మ మీద అచంచల విశ్వాసం దీనికి మూలాధారం. శరణాగతికి అంగాలను ఈ శ్లోకం వివరిస్తుంది.

"ఆనుకూల్యస్య సంకల్పః, ప్రాతికుల్యస్య వర్జనం,
రక్షిస్యతీతి విశ్వాసః, గోప్తృత్వవరణం తథా,
ఆత్మనిక్షేప కార్పణ్యే షడ్విధః శరణాగతిః"

(1) ఈశ్వరార్పణ కర్మములైన లక్షణముల నార్జించుట; (2) తద్విరుద్ధమైన వాటిని వదలిపెట్టుట; (3) పరమాత్మ తన్ను కాపాడుతాడనే దృఢ విశ్వాసం కలిగియుండుట, (4) తన్ను రక్షించమని వేడుకొనుట; (5) ఆత్మీయములైన వాటి నన్నింటిని స్వామికి సమర్పించుట; (6) తన అశక్తతను పరమాత్మకు నివేదించుట. వీటిలో నాల్గవది గోప్తృత్వవరణం శరణాగతికి (అంగి)యని, మిగిలినవి అంగములని శాస్త్ర నిర్ణయం.

ఇక దక్షిణాదిని గల తెన్గలై శాఖవారు శరణాగతి ఏకైక మార్గమని, స్వామికి శరణాగతిచేస్తే, అంటే ఆత్మార్పణంచేస్తే ఇక ముక్తి నివ్వడం ఆయన బాధ్యతేనని, ఇక మన ప్రయత్నం ఏమీ అవసరంలేదని నమ్ముతారు. దీన్ని 'మార్జాలకిశోర న్యాయము' అంటారు. పిల్లి తన కూనలను నోటితో కరచుకొని సురక్షిత ప్రదేశానికి తీసుకు వెళ్ళుతుంది. దీంట్లో కూనల బాధ్యత ఏమీలేదు. ఉత్తరాదినగల వడగలై శాఖవారు ప్రపత్తి ఒక మార్గమేగాని మన ప్రయత్నం కూడా కొంతకావాలని నమ్ముతారు. దీన్ని 'మర్కటకిశోర న్యాయం' అంటారు. కోతి పిల్లలు కోతిని పట్టుకుని ఉంటే కోతి

ఒక చెట్టుమీద నుండి మరొక చెట్టుమీదకు దూకుతూ ఉంటుంది. కోతి బాధ్యత బరువును మొయ్యడమే, పిల్లల భాద్యత గట్టిగా పట్టుకుని, కోతి ఎగిరేటప్పుడు గాయాలు కాకుండా చూసుకోవాలి. ఇందులో పిల్లల బాధ్యత కూడా ఉంది.

ఇక భాగవతంలోని ప్రహ్లాదోపాఖ్యానం, గజేంద్రమోక్షం, రుక్మిణీ కళ్యాణం, కుచేలోపాఖ్యానం మొదలైన వాటిలో భక్తి తత్త్వాన్ని విశిష్టాద్వైతం ఆదరిస్తుంది. మిత్రత్వంతో గాని, బంధుత్వంతోగాని, కామంతోగాని (మధురభక్తి), చివరికి శత్రుత్వంతోగాని స్వామిని సమీపించి స్మరిస్తే ఆయన అనుగ్రహిస్తాడని భాగవతం చెప్తుంది. ఆశ్చర్యకరంగా శత్రుత్వంతోనే మోక్షం సంభవమని చెప్పే ఈ పద్యం స్వామి ఎంత కృపామయుడో మనకు బోధిస్తుంది.

క. **వైరానుబంధన మున,**
జేరిన చందమున విష్ణు జిరతర భక్తిం
జేరగ రాదని తోచును,
నారాయణ భక్తి యుక్తి నా చిత్తమునన్. (భా. 7.15)

విశిష్టాద్వైతం భగవద్భక్తి కంటె భాగవత భక్తి ముఖ్యంగా ప్రవచిస్తుంది. ఆచార్యభక్తి అత్యంతావశ్యకం. ఆయన అనుగ్రహం, మార్గదర్శకత్వం లేనిదే ఏ ఉపాసన, మోక్షం పొందడానికి చేసే, ఏ ఇతర అధ్యవసాయం సాధ్యంకాదు, ఫలించదు. ఈశ్వరార్పణ

బుద్ధితో చేసే నిష్కామ కర్మానుష్ఠానం సత్వగుణాన్ని పెంచి భక్తి మార్గం వైపు నడిపించి మోక్ష సాధనంగా మారుతుందని విశిష్టాద్వైతం నిష్కామ కర్మను ఆదరించింది.

13. మోక్షము

అద్వైతంలో మోక్షమంటే జీవాత్మ తన స్వరూపాన్ని తెలుసుకొనిన మరుక్షణం బ్రహ్మం అయిపోవడం. ఇక మిగిలిదేమీ ఉండదు. ఏమీ ఉండనప్పుడు తార్కికంగా పునర్జన్మ ఉండదు. మోక్షం సిద్ధించిన తరువాత మోక్షానందాన్ని అనుభవించేందుకు ప్రత్యేకమైన తత్త్వం ఏమీ ఉండదు. దీనికి కారణం స్వరూపైక్యం.

ఈ స్వరూపైక్యాన్ని విశిష్టాద్వైతం అంగీకరించదు. జీవుడు, పరమాత్మ వేరు. ఇద్దరూ జ్ఞానస్వరూపులే, ఇద్దరూ నిత్యులే. ఎన్ని జీవాలున్నాయో అన్ని జీవాత్మలున్నాయి. జీవుడు భక్తిమార్గాన్ని అనుసరిస్తూ భగవత్కృపకు పాత్రుడవుతాడు. కర్మాచరణలో ఒకప్పుడు ఎంత పాపాత్ముడైనా అనుకోకుండానే సత్కర్మ చేస్తాడు - ఆవును కొట్టబోతే అది పారిపోయి గుడిచుట్టూ తిరుగుతుంది. దాన్ని వెంబడించి గుడికి చుట్టూ మూడుసార్లు తిరుగుతాడు. పరమాత్మ దాన్ని భక్తితో చేసిన ప్రదక్షిణంగానే తలచి ఇకముందు ఇతనికి పునర్జన్మ లేకుండా చెయ్యాలనుకుంటాడట. దీన్ని అజ్ఞాత సుకృతం అంటారు. దీన్ని విశిష్టాద్వైతులు ఎందుకు చేప్తారంటే ఎన్ని ఉపాసనలు, తీర్థయాత్రలు, పూజలు చేసినా భగవత్కృప ఉంటేనే మోక్షం అని చెప్పడానికి. ఇదంతా భక్తికి సంబంధించినది.

ఇక శరణాగతి చేస్తే అంతా భగవంతుడిదే బాధ్యత. ఆయన మోక్షం ప్రసాదిస్తాడు.

ముక్తజీవి వైకుంఠం చేరుకుంటాడు. ఇక్కడ దివ్యమంగళ స్వరూపవిశిష్టుడైన శ్రీమన్నారాయణుడు లేక పరవాసుదేవు డుంటాడు. ఆయన సన్నిధలో పరమానందంతో ఆయన్ని సేవించుకుంటూ ఏ కోరిక లేక ఉంటాడు. పునర్జన్మ ఉండదు. వైకుంఠంలో లక్ష్మీదేవి, గరుడాళ్వారు, విష్వక్సేనాదులు ఉంటారు. వారందరి సన్నిధిలో శాశ్వతానందాన్ని పొందుతాడు. దీన్నే సాయుజ్యం అంటారు. విశిష్టాద్వైతంలో జీవన్ముక్తి లేదు.

ముక్తజీవి 'అపహతపాపాత్ము' డౌతాడు - అంటే పాపపుణ్యాలన్ని పటాపంచలౌతాయన్నమాట. ఇక్కడ 'పాపం' అనే దానిలో పుణ్యంకూడా చేరిందని వ్యాఖ్యాతలు అన్నారు. మరి పుణ్యంకూడా పోతే పుణ్యం వల్ల దక్కవలసిన స్వర్గసుఖాలు పోతాయికదా, ఇది అన్యాయం కదా! అంటే కాదంటుంది విశిష్టాద్వైతం. కారణం స్వర్గానికన్నా ఉత్కృష్టమైన పరవాసుదేవుని సన్నిధి పొందాడు కనుక.

మోక్షావస్థలో జీవులందరు ఒకే రూపంలో ఉంటారు. మనుష్యులు, జంతువులనే తారతమ్యం ఉండదు. ముక్తజీవులకు పరమాత్మకు మధ్య మూడు తేడాలుంటాయి. ముక్తజీవులు అణుపరిమాణంలో ఉంటే పరమాత్మ సర్వవ్యాపి; ఆయన సర్వ నియామకుడు, ముక్త జీవులుదాసులు; ఆయన సృష్టికార్యం చెయ్యగలడు, ముక్తజీవుల కది సాధ్యం కాదు. ఇలా పరమాత్మ ముక్తజీవుడు స్వభావంలోనూ, స్వరూపంలోనూ వేరుగానే

ఉంటారుగాని వారి ఐక్యత ఉండదు.

ఈ విషయాలన్నీ పాంచరాత్ర శాస్త్రంలో ఉన్నాయి. విశిష్టాద్వైతంలో పాంచరాత్రానికి వేదంతో సమానమైన ప్రతిపత్తి ఉంది. పాంచరాత్రం భక్తి ప్రపత్తుల ద్వారానే ముక్తి సాధ్యం అని చెప్తుంది. కష్టకాలంలో ఆర్తత్రాణ పరాయణుడైన, సాకారమూర్తి యైన దేవుడొకడుండాలని ప్రతిమానవుడు కోరుకుంటాడు. ఈ విషయాన్ని శ్రీశంకరులు కూడా గ్రహించడం చేతే 'లక్ష్మీనృసింహ! మమదేహి కరావలమ్బమ్' - 'లక్ష్మినృసింహ స్వామి! నాకు నీచేయూత నిమ్ము' అని ప్రార్థించారు. అయినప్పటికి అద్వైతంలో మానవుడు పిలిస్తే పలికే సగుణ, సాకార పరమాత్మ మనకు కనిపించడు. తద్విరుద్ధంగా విశిష్టాద్వైతంలో సగుణ సాకార పరమాత్మే కనిపించి, 'నేనున్నాను నిన్ను రక్షించడానికి' అని సిద్ధంగా ఉంటాడు - మనం ఆయన మీద విశ్వాసంతో ఆయన్ని భక్తితో ప్రార్థించడమే తరువాయి. ద్వైతంలో కూడా ఇంతే. నిజానికి మనం ఏం కోరుకోవాలో మనకు తెలియదట. ఆయనే మనకు ఏది మంచిదో అది అనుగ్రహిస్తాడట. ఈ కోణంలో చూసినప్పుడు దైవాన్ని విశిష్టాద్వైతం ఆర్తితో నున్న జీవునికి దగ్గరగా తీసుకునివచ్చింది. దీనికి కారణం అద్వైతం శ్రుతిమీద, ప్రస్థానత్రయం మీద ఆధారపడింది. అలాకాకుండా విశిష్టాద్వైతం భక్తిరసామృతాన్ని వెదజల్లే ఆళ్వారుల దివ్యరచనలమీద, పురాణాల మీద కూడా ఆధారపడి ఉంది. ఇవి భక్తి తత్త్వానికి ప్రతీకలు.

ఈ విధంగా పాంచరాత్రం ద్వారా, భక్తి ప్రపత్తులతో పరమాత్మ సన్నిధి చేరడమే మోక్షం అని విశిష్టాద్వైతం బోధించింది.

దీని పర్యవసానంగానే దివ్యక్షేత్రాలు వెలసి, అద్వైతులు, విశిష్టాద్వైతులు, ద్వైతులు అనే భేదం లేకుండా ఆర్తులైన అశేష భక్తజనాన్ని ఆకర్షిస్తున్నాయి. భగవంతుడి కృపకు పాత్రులను చేస్తున్నాయి. మతానుభూతిని విశేషంగా కల్పించాయి.

14. శాఖా భేదాలు

రామానుజుల నిర్యాణం తరువాత కొంతకాలానికి శ్రీ వైష్ణవులు వడకలై - తెన్గలై అనే రెండు శాఖలుగా విడిపోయారు.

విశిష్టాద్వైతం రామానుజులకు పూర్వమే ఉంది. దక్షిణ భారతంలో అది సంస్కృతంలో గల ప్రస్థాన త్రయం మీద, ద్రావిడభాషలోని ఆళ్వారులు దివ్య ప్రబంధముల మీద ఆధారపడి ఉంది. ఉత్తర భారతంలో అది కేవలం సంస్కృత భాషలో గల గ్రంథాలమీదే ఆధారపడి ఉంది. రామానుజులు రెండింటిని ఆదరించి బ్రహ్మసూత్రాల మీద శ్రీభాష్యం, భగవద్గీత మీద విశిష్టాద్వైత పరంగా భాష్యంమొదలైన రచనలు చేసి యావద్భారత దేశం సంచరించి విశిష్టాద్వైతానికి విశేష ప్రచారం తీసుకువచ్చారు. నిజానికి ఏ తెగకు చెందినవారైనా పరమాత్మ సగుణ సాకారుడని, జీవుడికంటె ఆయన విశిష్టుడని, మోక్షం అంటే వైకుంఠంలో ఆయన సన్నిధికి చేరడమనే మౌలిక విషయాలలో భావసారూప్యం ఉంది.

దక్షిణభారతంలో సంస్కృత ద్రావిడ భాషలలోని విశిష్టాద్వైత వాఙ్మయాన్ని అధ్యయనం చేసి ప్రవచించే వారిని ఉభయ వేదాంత

ప్రవర్తకులంటారు. దక్షిణ భారతంలో ద్రావిడ భాషలో గల దివ్య ప్రబంధాలకే ప్రాముఖ్యత ఇస్తారు. వీరిని తెన్గలై శాఖవారని అంటారు. ఉత్తర భారతంలోని వారు సంస్కృత గ్రంథాలకే ప్రాముఖ్యం ఇస్తారు, కాని వారిని వడకలై శాఖవారని అంటారు. అయితే అందరికి శ్రీమద్రాజనులమీద విశిష్టా ద్వైతంమీద ఉభయ భాషలలోని గ్రంథాల మీద అపారమైన ఆదరణ ఉంది.

ప్రధానంగా తిలక ధారణలో వీరిద్దరి మధ్య తేడా ఉంది. మోక్షానికి భక్తి ప్రపత్తులలో దేనికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి అనే దాని మీద, కొన్ని కర్మాచరణల మీద, కులతత్వాన్ని భక్తుల విషయంలో పాటించాలా అక్కరలేదా అనే విషయాల మీద అభిప్రాయ భేదాలున్నాయి. అయితే ఇవి కొంత ముదిరి దేవాలయాల్లో ఆధిపత్యపోరుకు దారితీశాయి. తిరుమల కొండమీద వైష్ణవులలో ఈశాఖాభేదం కొంత వైషమ్యానికి కారణం అవుతూందని కొన్ని ఆరోపణలు ఉన్నాయి. అయినా వివాహాది శుభకార్యాలలోనూ ఇతరత్రా అందరూ ఆదరభావంతోనే మెలగుతున్నారు.

ఏమైనా మౌలిక సిద్ధాంతాల మీద అభిప్రాయ భేదాలు లేవు గనుక శ్రీ వైష్ణవులందరు ఐకమత్యంగా ఉండి విశిష్టాద్వైత వ్యాప్తికి, దేవాలయాల నిర్వహణా సామర్థ్యానికి, శ్రీమన్నారాయణుడి మీద భక్తికి దోహదం చెయ్యాలని వైష్ణవులలోని పెద్దలందరు కోరుకుంటున్నారు.

15. మరి కొందరు విశిష్టాద్వైత సిద్ధాంత ప్రవర్తకులు

భగవద్రామానుజుల అనంతరం ఆయన శిష్యులలో ఒకరైన శ్రీ పరాశర భట్టర్ వారు ఆచార్య పీఠాన్ని అలంకరించారు. వీరు 'రంగరాజస్తవము' 'అష్టశ్లోకి' అనే స్తోత్రాలను 'తత్త్వరత్నాకరము' అనే సుప్రసిద్ధ శాస్త్ర గ్రంథాన్ని రచించారు. వీరు నిస్సంతు కావడం వల్ల వీరి తమ్ముని కుమారుడైన శ్రీ సుదర్శన భట్టర్ వారు వంశోద్ధారకులయారు. వీరు శ్రీ రామానుజుల శ్రీభాష్యానికి 'శుతప్రకాశికా' అనే ప్రసిద్ధ వ్యాఖ్యానాన్ని రచించారు. ఈ వ్యాఖ్యానమే లేకపోతే శ్రీభాష్యాన్ని అర్థం చేసుకోవడం దుర్లభమయ్యేదని పండితులంటారు. దీని వల్ల ఈయనకు శ్రుతప్రకాశికాచార్య అనే సార్థక నామం వచ్చింది. తురుష్కుల దాడిలో అతి అమానుషంగా వీరు హత్యకు గురి కావడం అత్యంత విషాదకర ఘట్టం. అయితే వీరి తల్లి గారు శ్రీ వేదాంతదేశికుల వారికి వీరి శ్రుత ప్రకాశిక గ్రంథాన్ని ఇచ్చి వారి సహాయంతో దాన్ని రక్షించారు.

తరువాత పేర్కొనదగినవారు శ్రీ వేదాంతదేశికుల వారు. వీరు శతాధిక గ్రంథకర్త, విశిష్టాద్వైత పరంగా అనేక వ్యాఖ్యానాలు, పాదుకాసహస్రం, దయాశతకం మొదలైన స్తోత్ర గ్రంథాలు రచించారు. తరువాత నంబిళ్ళై గారు తిరువాయిమొళి ప్రబంధం మీద 'ఈడు' అనే వ్యాఖ్యానాన్ని రచించారు. ఇది 'భగవద్విషయము' అనే పేరుతో ప్రసిద్ధమైంది. వీరికి లోకాచార్యులనే బిరుద నామం ఉంది. వీరి శిష్యులు 'శ్రీ కృష్ణపాదులు' తమ కుమారునికి పిళ్లైలోకాచార్య స్వామి 'శ్రీవచన భూషణము' అనే ప్రసిద్ధ గ్రంథాన్ని రచించారు. తరువాత

శ్రీమణవాళమహామునులు (సంస్కృతంలో వీరిని 'వరవరముని' అంటారు) అనేక స్తోత్రాలను, 'శ్రీవచనభూషణం' మొదలైన వాటి మీద వ్యాఖ్యానాలను వ్రాసి ప్రసిద్ధులైనారు. వీరి ఉపన్యాసం గంగా ప్రవాహంలా ఉండేదట.

ఇక ఆధునిక కాలంలో తెలుగులో రామాయణం, భాగవతం, తిరుపావై మొదలైన వాటి మీద అనర్గళంగా ఉపన్యాసాలననుగ్రహించిన మహానుభావులు కీ.శే. శ్రీ మరింగంటి శ్రీరంగాచార్యులు వారు, కీ.శే. శ్రీభాష్యం అప్పలాచార్యులు వారు. వీరిలో శ్రీ అప్పలాచార్యులు వారు తిరుప్పావై మీద, సుందరకాండ మీద రచించిన వ్యాఖ్యానాలు సుప్రసిద్ధాలు. అలాగే మహామహోపాధ్యాయ కవిశాబ్దిక కేసరి శ్రీ నల్లాం చక్రవర్తుల రఘునాధాచార్య స్వామి వారు. అన్ని సిద్ధాంతాలలోను సమాన ప్రతిభాపాటవాలు ఉండటం వీరి ప్రత్యేకత. ఉపన్యాస చక్రవర్తి, శతాధిక గ్రంథకర్త, సత్సంప్రదాయ పరిరక్షణ సభ, వరంగల్ ద్వారా వీరి రచనలు ప్రచురింప బడుతున్నాయి. విష్ణుసహస్ర నామం మీద వీరు రచించిన వ్యాఖ్యానం నభూతో నభవిష్యతి. ఈ కోవకు చెందినవారే శ్రీ కందాడై రామానుజాచార్యస్వామి వారు. తమ ఉపన్యాసముల ద్వారా ప్రజలలో భక్తిప్రపత్తులను పెంచడానికి ప్రస్తుతం వారు చేసే సేవ అత్యంత ప్రశంసనీయం.

ప్రస్తుతం అహోబిలస్వామి వారు, శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయరు స్వామి వారు, విశిష్టాద్వైత సిద్ధాంత ప్రవక్తకులుగా ఆధ్యాత్మిక ప్రచారం విరివిగా చేస్తున్నారు.

విశిష్టాద్వైత సిద్ధాంత ప్రచారంలోను, ప్రజలలో భక్తి ప్రపత్తులను పెంచడంలోను, స్త్రీలు కూడా పురుషులకేమి తీసిపోలేదు. అటువంటి విద్వన్మణులలో శ్రీమంతులు టి.కె.చూడామణి, తిరువెంగళమ్మ, జానకి మొదలైనవారు ప్రసిద్ధులు.

16. ఉపసంహారం

వేదాంతం అంటే శంకరాద్వైతమే అనే భావన ప్రజాబాహుళ్యంలో బలంగానే ఉండేది. అయితే క్రమంగా దీనికి ప్రతిఘటన వచ్చింది. శంకరుల తరువాత భాస్కరాచార్యుల వారు శంకరుల మాయావాదాన్ని తీవ్రంగా ఖండించారు. తరువాత రామానుజులు శంకరుల అద్వైతంలోని మౌలికాంశాలన్నింటితోనూ విభేదించి మతానికి దగ్గరగా, ప్రజలలో భగవంతుని మీద అచంచల విశ్వాసాన్ని పెంచి, ఆర్తులైన వారిని రక్షించేందుకు అందుబాటులో నున్న దైవం ఉందనే భరోసా ఇచ్చిన సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టిన ఘనత దక్కించుకున్నారు. అప్పటికి బలంగా ఉన్న అద్వైతాన్ని, శైవాన్ని ఒక్క కుదుపు కుదిపి, ప్రజలను విశేషంగా ఆకర్షించి, విశిష్టాద్వైతం తనవైపుకు తిప్పుకుంది. మతవిశ్వాసాలకు అతీతమైన

పారామార్థిక తత్త్వం అద్వైతం. విశిష్టాద్వైతం మతంతోను పురాణేతిహాసాలతోను పెనవేసుకుపోయి విశ్వాసానికి పెద్దపీట వేసిన సిద్ధాంతం. గమనించవలసిన విషయం ఏమిటంటే విశిష్టాద్వైతం ఎంతగా ప్రచారం పొంది సులభంగా ఆచరణీయమైన సిద్ధాంతంగా

వెలసినా అద్వైతానికి ఒక సవాలుగా మారిందే తప్ప అద్వైతాన్ని పూర్తిగా తెరమరుగు చెయ్యలేక పోయింది. విశిష్టాద్వైతం పరమాత్మ సౌలభ్యాన్ని బోధించింది గనుక అద్వైతులుగానే ఉంటూ విశిష్టాద్వైతం సూచించిన భక్తిమార్గాన్ని ప్రజలు అనుసరించడం మనం చూస్తున్నాం. శంకరాద్వైతాన్ని పురస్కరించుకొని రాధాకృష్ణ పండితులు 'అతని నిర్గుణబ్రహ్మ మన హృదయంలో నుజ్వల ప్రేమనుగాని, భక్తినిగాని జనింపజేజాలదు. ఎవ్వడు, ఎన్నడు జూచి యుండనట్టి జూడరానట్టియు, నెవ్వడు సమీపించుట కవకాశములేని జ్యోతిర్మయ స్వరూపము గలట్టియు నిర్గుణ బ్రహ్మమును మన మారాధింపజాలము' అని స్థితిని ఆవిష్కరించారు. ఈ లోటును విశిష్టాద్వైతం తీర్చి ఇష్టదైవారాధనకు, తద్వారా ముక్తికి ఒక సౌలభ్యాన్ని కలిగించింది. విభేదాలు ఎన్నిఉన్నా రెండు సిద్ధాంతాలు జనబాహుళ్యంలో సహజీవనం చేస్తున్నట్టు కనిపిస్తుంది. దీనికి కారణం రెండూ ఆస్తిక మతాలే, రెండూ ప్రస్థాన త్రయం మీద ఆధాపడినవే. ప్రస్తుతం ఇలాంటి సమన్వయ దృక్పథం అవసరం.

ఉపయుక్త గ్రంథములు

1. భారతీయతత్త్వశాస్త్రము
డా॥ సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు,
విద్వాన్ బులుసు వేంకటేశ్వర్లుగారి అనువాదం
(తి.తి.దే. ప్రచురణ)

2. Bhakti Schools of Vedanta
Swami Tapasyananda
Sri Ramakrishna Math Publication.

3. సిద్ధాంతత్రయ సంగ్రహము
శ్రీకపిస్థలం దేశికాచార్య
సంప్రదాయ పరిరక్షణసభ, వరంగల్.

4. విశిష్టాద్వైత వైభవము
శ్రీన.చ.రఘునాథాచార్యులు
సంప్రదాయ పరిరక్షణసభ, వరంగల్.

5. రామానుజాచార్యులు
ఆర్. పార్థసారధి
నేషనల్ బ్రుక్ టస్టు, ఇండియా.

శ్రీ వేదభారతి

వేదశబ్ద పరిరక్షణకు, వేదవిజ్ఞాన ప్రచారానికి ఏర్పడిన ధార్మిక సంస్థ శ్రీవేదభారతి.

ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం అని పిలవబడే నాలుగు వేదాలకు సుమారు 1131 శాఖలు ఉండేవని మన ప్రాచీన గ్రంథాల ద్వారా తెలుస్తోంది. కాని నేడు 13 వేదశాఖలు మాత్రమే లభిస్తున్నాయి. ఈ 13 శాఖలలోను, 7 శాఖలకు మాత్రమే గురుశిష్యపరంపర కొనసాగుతోంది. మిగిలిన 6 శాఖలు పాక్షికంగా మాత్రమే లభిస్తున్నాయి. ఈ విధంగా మన ప్రాచీన భారతీయ విజ్ఞానంలో 99% పైగా పోగొట్టుకున్నాము.

వేద విజ్ఞానాన్ని అత్యవసరంగా పరిరక్షించుకోవడానికి శ్రీ వేదభారతి ఆధునిక కంప్యూటర్ టెక్నాలజీని ఎన్నుకొంది. అందులో - రికార్డింగ్ ద్వారా వేద మంత్ర ఉచ్చారణను జాగ్రత్త చేయడానికి కృషిచేస్తోంది. మిగిలి ఉన్న వేదశబ్దాన్ని రికార్డింగ్ చేస్తే సుమారు 3,000 గంటలు కావచ్చునని అంచనా వేయగా, ఇప్పటికి సుమారు 900 గంటలు పూర్తి అయింది. 200 పైగా ఆడియో/మల్టీమీడియా సిడిలరూపంలో అందుబాటులోనికి తీసుకొనివచ్చింది.

వేదాలపై శాస్త్రీయ పరిశోధన & ప్రచురణ :

వేదాలలో ఆధునిక శాస్త్రీయ సాంకేతిక విషయాలను వెలుగులోనికి తీసుకువచ్చే ప్రయత్నంలో "వేదంలో కంప్యూటర్ విజ్ఞానం", "వేదశాస్త్రాలలో ఆధునిక శాస్త్రీయ రహస్యాలు", "భూ కంపాలను ముందుగా పసిగట్ట గల్గుట సాధ్యమా?" మొదలైన అత్యున్నత శ్రేణి పరిశోధనా గ్రంథాలతో బాటు, "వేదగణితం" వంటి సిడి/డివిడిలను కూడా శ్రీవేదభారతి వెలువరించడం జరిగింది.

వైదిక గణితం బోధన :

టి.టి.డి. మరియు భక్తి టీ.వి. ఛానల్స్ ద్వారా లక్షలాదిమంది విద్యార్థులకు వేదగణితం, వేదవిజ్ఞానం వంటి విషయాలు పరిచయం చేయబడుతున్నాయి. విద్యార్థులకు అందుబాటులో ఉండేట్లుగా వైదిక గణితం ప్రచురించడం జరిగింది. ఈ కృషిని గుర్తించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం **"బంగారు నంది"** బహుమతిని అందించింది.

అభ్యర్థన :

శ్రీ వేదభారతి చేస్తున్న కృషికి అందరూ చేయూతనందించవలసిందిగా ప్రార్థన!!!